ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -132 పేజీలు - 08 వెల - 04/- గురువారం 27 ఫిబ్రవరి 2025

# ఆరేళ్ల నిషేధం సరిపోతుంది

**దోషులుగా తేలిన రాజకీయ నాయకులపై జీవితకాల నిషేధం అవసరంలేదు!: సుప్రీంకోర్టుకు కేంద్రం**

**దోషులుగా తేలిన నాయకులపై జీవితకాల నిషేధం విధించాలని సుప్రీంకోర్టులో పిటిషన్**

**సుప్రీంలో అఫిడవిట్ దాఖలు చేసిన కేంద్ర ం**




# సినీ నటుడు పోసాని అరెస్ట్

**రాయదుర్గం మై హెూం భుజా లో**

**అరెస్ట్ చేసిన ఏపీ పోలీసులు**

**సినిమా పరిశ్రమపై విమర్శలు చేశారనే**

**ఫిర్యాదు నేపథ్యంలో అరెస్ట్**

**పోసానిపై నాన్-బెయిలబుల**

**వారెంటును జారీ చేసిన రాజంపేట కోర్టు**





# పెద్దల సభకు స్థానం దక్కేనా ..?

**పొత్తులు.. సీట్ల సర్దుబాట్లలో త్యాగాలు చేసిన వారికే.. ప్రాధాన్యత**

**- అధిష్టానం అనుగ్రహం కోసం ఎదురుచూపులు**

**5 స్థానాలూ కూటమికే.. ఏకగ్రీవమే**

**ఒక సీటు నాగబాబుకు ఖరారు మరో స్థానం ఆశిస్తున్న బీజేపీ**




# రెండోరోజూ ముగిసిన వంశీ విచారణ

**- సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపులపై ఆరా**




మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ రెండో రోజు విచారణ ముగిసింది. పోలీసులువంశీని 20 ప్రశ్నలు పైగా సంధించారు. నిన్నటి లాగే పోలీసులు అడిగిన కొన్ని ప్రశ్నలకు నాకు తెలియదు, సంబంధం లేదు అంటూ వంశీ సమాధానం చెప్పారు.




## పిల్లలకు సాక్షులుగా ఉండేందుకు కనీస వయసేమీ లేదు

**పిల్లల సాక్ష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**

**భార్యను చంపిన వ్యక్తి కేసు విచారణ**

**ఆ దంపతుల ఏడేళ్ల కుమార్తె సాక్ష్యం**

**వ్యక్తికి జీవిత ఖైదు విధించిన సుప్రీంకోర్టు**

**కానీ ట్రయల్ కోర్టులు అప్రమత్తంగా ఉండాలని సూచన**

2లో

# మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ కు నిధులు ఇవ్వండి

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి**

- హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 కు అనుమతి ఇవ్వండి
- ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని మంజూరు చేయండి
- రీజినల్ రింగ్ రైల్... డ్రైపోర్ట్‌లు మంజూరు చేయండి
- సెమీ కండక్టర్ మిషన్‌కు అనుమతించండి



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి : హైదరాబాద్ మహా నగరంలో మెట్రో రైలు సౌకర్యం అన్ని ప్రాంతాలకు అందుబాటులోకి ఉద్దేశించిన హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు అనుమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం పదేళ్లుగా హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణపై దృష్టి సారించలేదని ప్రధానమంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో ఫేజ్-2 కింద రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కి.మీ పొడవైన అయిదు కారిడార్లను ప్రతిపాదించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టుకు వెంటనే అనుమతిం చాలని అభ్యర్థించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో ఇప్పటికే 90 శాతం భూ సేకరణ పూర్తయినందున ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని మిగతాది 2లో...

# కేఆర్ఎంబీ సమావేశానికి ఏపీ గైర్హాజరు...




**స్పందించిన తెలంగాణ అధికారి రాహుల్ బొజ్జా మరోమారు సమావేశం కావాలని నిర్ణయం**

**ఏపీ అధికారులు ఉద్దేశపూర్వకంగా హాజరు కాలేదన్న రాహుల్ బొజ్జా**

**తన వాదనలు రికార్డు చేసి కేంద్రానికి పంపించాలన్న రాహుల్ బొజ్జా**

ఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి :

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు చైర్మన్ అతుల్ జైన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జలసౌధలో కేఆర్ఎంబీ సమావేశం జరిగింది. ఈ భేటీలో తెలంగాణ నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్) అనిల్ కుమార్ పాల్గొన్నారు. సమావేశానికి ఆంధ్రప్రదేశ్ నుంచి అధికారులు హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో రేపు మరోమారు సమావేశం కావాలని నిర్ణయించారు. మిగతాది 2లో...

# పులివెందులలో రాజారెడ్డి కంటి ఆసుపత్రి ప్రారంభించిన జగన్

**ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్ స్టిట్యూట్ సహకారంతో కంటి ఆసుపత్రి విస్తరణ**

**ఆసుపత్రి ప్రారంభించడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తానన్న జగన్**

**కంటి పరీక్షలు చేయించుకున్న జగన్**

**జగన్ కు ఎలాంటి కంటి సమస్యలు లేవన్న డాక్టర్**





# శివాలయాలకు పోటెత్తిన భక్తజనం

**భక్తుల రాకతో కిటకిటలాడుతున్నశ్రీశైలం**

**భారీగా తరలి రావడంతో సందడిగా గిరులు**

శ్రీశైలం,ఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి :

ప్రసిద్ధి పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీభ్రమరాంబికామల్లికార్జున స్వామి దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. భక్తులతో శ్రీశైలం కిటకిటలాడుతోంది. శివనామస్మరణతో ఆలయ పురవీధులు మారుమ్రోగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి వారికి వాహనసేవలు వైభవంగా సాగుతున్నాయి. శ్రీశైల పుణ్యక్షేత్రం భక్తులతో రద్దీగా మారింది. శివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామిదర్శనం చేసుకోవటానికి నల్లమల అటవీప్రాంతం నుంచి భారీగా భక్తులు తరలి రావడంతో శ్రీగిరులు భక్తులతో కోలాహలంగా మారయి. మిగతాది3లో...



## కేఆర్ఎంబీ సమావేశానికి ఏపీ గైర్హాజరు...

ఆంధ్రప్రదేశ్ నుంచి అధికారులు ఎవరూ హాజరు కాకపోవడంపై రాహుల్ బొజ్జా స్పందించారు. సమావేశం ఏర్పాటు చేస్తే ఏపీ అధికారులు ఉద్దేశపూర్వకంగానే హాజరు కాలేదని ఆరోపించారు. తన వాదనలను రికార్డు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని కోరారు.కాగా, శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి మే వరకు తమకు 55 టీఎంసీల నీరు కావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరగా, తమకు 63 టీఎంసీల నీరు కావాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది.

## ఆరేళ్ల నిషేధం సరిపోతుంది

అమరావతి,ఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి :

క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన రాజకీయ నాయకులపై జీవిత కాల నిషేధం చాలా కఠినమైనదని, ప్రస్తుతం ఉన్న ఆరేళ్ల అనర్హత సరిపోతుందని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు భారత అత్యున్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేసింది.క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన రాజకీయ నాయకులపై జీవితకాల నిషేధం విధించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ప్రస్తుతం ఉన్న ఆరేళ్ల నిషేధం సరిపోదని, క్రిమినల్ కేసులు ఉన్న రాజకీయ నాయకులు ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాలం నిషేధం విధించాలని కోరుతూఅశ్విని ఉపాధ్యాయ్ అనే న్యాయవాది పిటిషన్ వేశారు.ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం కేంద్రం అభిప్రాయం కోరింది. ఈ నేపథ్యంలో కేంద్రం ఈరోజు సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. జీవితకాల నిషేధం అత్యంత కఠిన చర్య అని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న ఆరేళ్ల నిషేధం సరిపోతుందని అఫిడవిట్‌లో పేర్కొంది. క్రిమినల్ కేసులలో దోషులుగా తేలిన రాజకీయ నాయకులపై జీవితకాలం నిషేధం విధించాలా? ఆరేళ్ల నిషేధం విధించాలా? అనేది పార్లమెంటు పరిధిలోని అంశమని కేంద్రం తన అఫిడవిట్‌లో పేర్కొంది. పార్లమెంటు ఇప్పటికే అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆరేళ్ల నిషేధం విధించిందని సుప్రీంకోర్టుకు తెలిపింది. సుప్రీంకోర్టు తుది నిర్ణయాన్ని వెలువరించాల్సి ఉంది.

## పిల్లలకు సాక్షులుగా ఉండేందుకు కనీస వయసేమీ లేదు

అమరావతి,ఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి :ఏ కేసులోనైనా పెద్దవాళ్ల సాక్ష్యం ఎలా చెల్లుబాటు అవుతుందో, చిన్న పిల్లల సాక్ష్యం కూడా అదే రీతిలో చెల్లుబాటు అవుతుందని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భార్యను చంపిన ఓ వ్యక్తికి జీవితఖైదు విధించే క్రమంలో ఆ దంపతుల ఏడేళ్ల కుమార్తె సాక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకున్న సందర్భంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. సాక్ష్యాధారాల చట్టంలో ప్రత్యేకంగా సాక్షికి కనీస వయసు ఇంత ఉండాలన్న నిబంధన ఏదీ లేదని పేర్కొంది. సాక్షి చిన్నారి అయినంత మాత్రాన ఆ సాక్ష్యాన్ని తోసిపుచ్చలేమని వివరించింది. "అయితే పిల్లల సాక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకునే క్రమంలో కోర్టు ఒక ముందుజాగ్రత్త తీసుకోవాల్సి ఉంటుంది. పిల్లలు ఇతరుల మాయమాటల ఉచ్చులో సులభంగా పడిపోయే ప్రమాదం ఉంటుంది... పిల్లలు నమ్మదగిన సాక్షులుగా ఉండాలంటే, వారు అలాంటి మాయమాటల ప్రభావంలో పడకుండా చూడాలి" అని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. పిల్లలు సాక్షులుగా ఉన్నప్పుడు వారు నిజమే చెబుతున్నారా అనేది కోర్టులు లోతుగా పరిశీలించాల్సి ఉంటుందని, ఆ చిన్నారులు స్వచ్ఛందంగా చెబుతున్నారా, ఇతరుల ప్రభావానికి గురై అలా చెబుతున్నారా అనేది గమనించాలని సూచించింది. ఒకవేళ పిల్లలు ఎవరి ప్రభావానికైనా లోనై తప్పుడు సాక్ష్యం చెబితే అంతకంటే ప్రమాదం ఇంకోటి ఉండదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో ట్రయల్ కోర్టులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## పులివెందులలో రాజారెడ్డి కంటి ఆసుపత్రి ప్రారంభించిన జగన్



పులివెందులఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి : వైసీపీ అధినేత జగన్ నేడు సొంత నియోజవకర్గం పులివెందులలో పర్యటించారు. పులివెందులలో ఎల్వీ ప్రసాద్-వైఎస్ రాజారెడ్డి కంటి ఆసుపత్రిని ప్రారంభించారు. ఆసుపత్రి ప్రారంభించిన సందర్భంగా జగన్ కూడా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఆయనకు కంటి సంబంధ సమస్యలేవీ లేవు డాక్టర్ నిర్ధారించారు. కాగా, పులివెందులలో ఇప్పటికే సేవలు అందిస్తున్న ఈ కంటి ఆసుపత్రిని మరింత విస్తరించారు. ఈ ఆసుపత్రి విస్తరణకు అవసరమైన స్థలాన్ని వైఎస్ రాజారెడ్డి ఫౌండేషన్ కేటాయించింది. అంతేగాకుండా, రూ.10 కోట్ల నిధులను కూడా సమకూర్చింది. దాంతో ఇక్కడ కంప్యూటరైజ్డ్ కంటి పరీక్షల యంత్రం, 25 వార్డులను ఏర్పాటు చేశారు. రోజుకు 5 వేల కంటి ఆపరేషన్లు నిర్వహించేలా ఈ ఆసుపత్రిని అభివృద్ధి చేశారు. కాగా, ఎల్వీ ప్రసాద్-వైఎస్ రాజారెడ్డి ఐ సెంటర్ ప్రారంభోత్సవంపై జగన్ ట్వీట్ చేశారు. రాజారెడ్డి కంటి ఆసుపత్రిని ప్రారంభించడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తానని తెలిపారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్ స్టిట్యూట్ సహకారంతో ఈ ఆసుపత్రిని విస్తరించారని, ఇందులో అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయని జగన్ వివరించారు. ఈ సందర్భంగా తన తండ్రి వైఎస్ స్మృతులు గుర్తుకొస్తున్నాయని, ఆయన కూడా పులివెందుల ఆసుపత్రిలో ప్రముఖ వైద్యుడిగా సేవలు అందించారని జగన్ పేర్కొన్నారు.

## సినీ నటుడు పోసాని అరెస్ట్



హైదరాబాద్ ఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి :ప్రముఖ సినీ నటుడు పోసాని కృష్ణమురళిని ఆంధ్రప్రదేశ్ పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని రాయదుర్గం మై హోం భుజా అపార్టుమెంటులో ఉంటున్న ఆయనను ఏపీలోని రాయచోటి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసి ఏపీకి తరలిస్తున్నారు.పోసానిపై గతంలో అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సినిమా పరిశ్రమపై విమర్శలు చేశారని స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి రాజంపేట కోర్టు పోసానిపై నాన్-బెయిలబుల్ వారెంటును జారీ చేసింది.ఈ నేపథ్యంలో ఈరోజు పోలీసులు రాయదుర్గం చేరుకొని పోసాని కృష్ణమురళిని అదుపులోకి తీసుకున్నారు. రేపు ఉదయం రాజంపేట కోర్టులో హాజరుపరిచే అవకాశముంది. తనను అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులతో పోసాని వాగ్వాదానికి దిగారు. పోలీసులు అతనిని అతికష్టంమీద అదుపులోకి తీసుకున్నారు.

## మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ కు నిధులుఇవ్వండి

వెంటనే మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఉత్తర భాగంతో పాటే దక్షిణ భాగం పూర్తయితే ఆర్ఆర్ఆర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకోగలమన్నారు. దక్షిణ భాగం భూ సేకరణకు అయ్యే వ్యయంలో 50 శాతం భరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి ప్రధానమంత్రికి తెలియజేశారు. ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉందని పీఎం మోదీకి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ రీజినల్ రింగ్ రైలు పూర్తయితే తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైలు మార్గాలతో అనుసంధానత సులభమవుతుందని ప్రధానమంత్రి మోదీకి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు.. రీజినల్ రింగ్ రైలుకు అనుమతి ఇవ్వాలని పీఎంను సీఎం కోరారు. సముద్ర మార్గం లేని తెలంగాణకు వస్తువుల ఎగుమతులు, దిగుమతులు సులువుగా చేసేందుకు రీజినల్ రింగు రోడ్డు సమీపంలో డ్రైపోర్ట్ అవసరమని, ఆ డ్రైపోర్ట్ నుంచి ఏపీలోని సముద్ర పోర్ట్ లను కలిపేందుకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు తో పాటు రోడ్డును ఆనుకొని రైలు మార్గం మంజూరు చేయాలని ప్రధానమంత్రి మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికత మూసీ నదితో ముడిపడి ఉందని... రాజధాని హైదరాబాద్ నగరం మధ్యగా మూసీ ప్రవహిస్తోందని.. అంత ప్రాధాన్యం ఉన్న మూసీ పునరుజ్జీవనానికి సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈసా, మూసా నదుల సంగమంలో ఉన్న బాపూ ఘాట్ అభివృద్ధి, మూసీ ప్రక్షాళనకు 27 ఎస్టీపీల నిర్మాణం, మూసీ రిటైనింగ్ వాల్స్, కరకట్టల నిర్మాణం, మూసీ గోదావరి నదుల అనసంధానంతో కలిపి మొత్తంగా ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్లు ఆర్థిక సహాయం అందజేయాలని ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ కు 222.7 ఎకరాల రక్షణ భూముల బదిలీకి సహకరించాలని పీఎంకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు 61 ఐపీఎస్ కేడర్ పోస్టులు వచ్చాయని, 2015లో రివ్యూ తర్వాత మరో 15 పోస్టులు అదనంగా వచ్చాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ కేసులు పెరగడం, రాష్ట్రంలో పెరిగిన పట్టణాలు, ఇతర అవసరాల దృష్ట్యా తెలంగాణకు అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయాలని పీఎం మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.సెమి కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు తెలంగాణలో ఉన్నందున ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ప్రాజెక్టును రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు అనమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉన్నారు.

# నేడు మూడు ఎమ్మెల్సీలకు ఎన్నిక

### భారీగా ఏర్పాట్లు చేసిన ఇసి అధికారులు



అమరావతి,ఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి :

రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం జరుగనున్న ఎన్నికకు ఏర్పట్లు పూర్తి చేశారు. అధికారులు బ్యాలెట్ పత్రలతో తమ ప్రాంతాలకు తరలి వెళ్లారు. ఇందుకోసం ఎన్నికల సంఘం భారీగా ఏర్పాట్లు చేసింది. ప్రధాన పక్షాల అభ్యర్థుల మధ్య పోటీ హోరాహోరీగా ఉంది. ఉమ్మడి గుంటూరు-కృష్ణా, తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రులు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ గురువారం జరగనుంది. గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రచారం జరగడంతో ప్రాధాన్యం నెలకొంది. మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగిసింది. ఈ ఎన్నికల్లో అధికార కూటమి తరపున రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు తెదేపా అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారికి రెండుచోట్లా పీడీఎఫ్ నుంచి గట్టిపోటీ ఎదురవుతోంది. ఈ రెండు స్థానాల్ని దక్కించుకునేందుకు కూటమి పార్టీలు సర్వశక్తులూ ఒడ్డి ప్రచారం చేశాయి. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల్లో ముగ్గురు ప్రధాన అభ్యర్థుల మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లుగా ఉంది. అక్కడ ఏపీటీఎఫ్ అభ్యర్థికి అధికార కూటమిలోని తెదేపా, జనసేన పార్టీలు మద్దతు ప్రకటించాయి. కొందరు భాజపా నాయకులు మాత్రం పీఆర్‌టీయూ అభ్యర్థికి మద్దతిస్తున్నారు. వైకాపా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంది. ఉమ్మడి గుంటూరు-కృష్ణా పట్టభద్రుల నియోజకవర్గం, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, పాకలపాటి రఘువర్మ మరోసారి అదృష్టాన్ని పరీక్షించు కుంటున్నారు. ఉమ్మడి తూర్పు-పశ్చిమగోదావరి పట్టభద్రుల స్థానానికి అత్యధికంగా 35 మంది, కృష్ణా-గుంటూరు స్థానానికి 25 మంది, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ స్థానానికి పదిమంది పోటీలో ఉన్నారు. ఉత్తరాంధ్రలో నువ్వానేనా అన్నట్లుగా పోటీ ఉంది. ఇక్కడ ప్రస్తుత ముగ్గురి మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్టుగా ఉంది. రఘువర్మ తరఫున ఉత్తరాంధ్రలోని కొన్ని ఉపాధ్యాయ సంఘాలతో పాటు, తెదేపా, జనసేన పార్టీల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు పనిచేస్తున్నారు. బరిలోంచి

వైదొలగిన సుంకరి శ్రీనివాసరావు కూడా రఘువర్మకు మద్దతుగా నిలిచారు. పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడిని ఆరెస్సెస్‌తో సంబంధం ఉన్న ఒక ఉపాధ్యాయ సంఘం బలపర్చడంతో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ సహా మరికొందరు భాజపా నేతలు ఆయనకు మద్దతిస్తున్నారు. విజయనగరం జిల్లాలో ఈ ఇద్దరు అభ్యర్థుల వర్గీయులు మొదటి ప్రాధాన్యత ఓటు ఒకరికి, రెండో ప్రాధన్యతా ఓటు మరొకరికి పరస్పరం వేసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. శ్రీకాకుళం జిల్లాలో యూటీఎఫ్ బలంగా ఉంది. గత ఎన్నికల్లో రఘువర్మకు యూటీఎఫ్ మద్దతివ్వగా, ఈసారి యూటీఎఫ్ నుంచే అభ్యర్థి బరిలోకి దిగడంతో ఆయన విజయావకాశాలపై కొంత ప్రభావం పడుతుందని భావిస్తున్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి, పీడీఎఫ్ అభ్యర్థుల మధ్య పోటీ రసవత్తరంగా మారింది. అధికార కూటమి తరపున బరిలో నిలిచిన తెదేపా నేత పేరాబత్తుల రాజశేఖరం విజయానికి ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన తెదేపా, జనసేన, భాజపా నాయకులు గట్టిగా పనిచేస్తున్నారు. పీడీఎఫ్ అభ్యర్థి డీవీ రాఘవుల్ని గెలిపించేందుకు సీపీఎంతో పాటు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు కృషిచేస్తున్నాయి. గత ఎన్నికల్లోలా భారీ ప్రచారాలు, విందులు వినోదాల హడావుడి ఈసారి లేదు. చాపకింద నీరులా అభ్యర్థులు ప్రచారం కొనసాగించారు. ధనప్రభావం కొంచెం ఎక్కువే ఉంది. కృష్ణా-గుంటూరు స్థానంలో హోరాహోరీ పోటీ ఉంది. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఎన్నిక ఆసక్తికరంగా మారింది. బరిలో 25మంది ఉన్నా ప్రధానంగా కూటమి అభ్యర్థి, తెదేపా సీనియర్ నేత, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మధ్యే ఉంది. ఎన్నికల ప్రకటన వెలువడక ముందే ఆలపాటి అభ్యర్థిత్వం ఖరారు కావడంతో ఆయన అన్నింటా ఒకడుగు ముందే ఉన్నారు. అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో తెదేపా, జనసేన, భాజపా నాయకుల్ని ఒకతాటిపైకి తెచ్చి వారి అండతో ఓటర్ల మద్దతు కూడగట్టారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న కేఎస్ లక్ష్మణరావు పీడీఎఫ్ తరఫున ఐదోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఉపాధ్యాయ సంఘాలు, వామపక్షాలు, ప్రజాసంఘాలు, కార్మిక సంఘాల్లో పట్టు ఉండటం లక్ష్మణరావుకు కలిసొచ్చే అంశం. పోటీపరీక్షలకు శిక్షణ ఇచ్చిన అనుభవం ఉండటంతో పట్టభద్రులతో నేరుగా సంబంధాలు ఉన్నాయి. వామపక్ష అనుబంధసంఘాలు లక్ష్మణరావు తరఫున ప్రచారం చేయడంతో ఎక్కువమందిని కలవగలిగారు.

కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తారన్న నమ్మకం. విస్తృతంగా ఓటర్ల నమోదు చేపట్టి, ఇంటింటి ప్రచారం చేయడం. ఎస్టీయూ, నోబుల్ టీచర్స్ అసోసియేషన్, టీఎన్‌యూఎస్, ఏపీటీఎఫ్, ఆఎ÷-టా తదితర సంఘాల మద్దతు. మూడు దశాబ్దాలకుపైగా రాజకీయాల్లో ఉండడం, ఎమ్మెల్యే, మంత్రిగా పలువురితో పరిచయాలు కలసి వస్తున్నాయి.

## రెండోరోజూ ముగిసిన వంశీ విచారణ

### మైనింగ్ తవ్వకాల తెలియదని సమాధానం - సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపులపై ఆరా

విజయవాడఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి : మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ రెండో రోజు విచారణ ముగిసింది. పోలీసులువంశీని 20 ప్రశ్నలు పైగా సంధించారు. నిన్నటి లాగే పోలీసులు అడిగిన కొన్ని ప్రశ్నలకు నాకు తెలియదు, సంబంధం లేదు అంటూ వంశీ సమాధానం చెప్పారు. గన్నవరం నియోజకవర్గంలో మైనింగ్ అక్రమా తవ్వకాలు జరిపారా అని వంశీని పోలీసులు ప్రశ్నించినట్టు సమాచారం. మైనింగ్‌కి తనకు ఎలాంటి సంబంధం లేదని.. కావాలనే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని సమాధానం ఇచ్చినట్టు సమాచారం. మంగళవారం పోలీసులు అడిగిన ప్రశ్నలకు వంశీ సరైన సమాధానం చెప్పలేదు. దీంతో.. ఈ రోజు టెక్నికల్ ఎవిడెన్సులు చూపించి అధికారులుప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టే ప్రయత్నం చేశారు. సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపులు వెనుక ఎవరెవరూ ఉన్నారు అనే కోణంలో పోలీసులు ప్రశ్నలు సంధించారు. సత్యవర్ధన్‌ను హైదరాబాద్ నుంచి విశాఖకు తీసుకుని వెళ్ళినప్పుడు ఎవరెవరు ఉన్నారని పోలీసులు ప్రశ్నించారు. అనంతరం.. వైద్య పరీక్షలు నిమిత్తం కృష్ణలంక పోలీసు స్టేషన్ నుంచి జీజీహెచ్‌కు తరలించారు. వల్లభనేని వంశీని కిడ్నాప్, బెదిరింపుల కేసులో అరెస్ట్ చేసిన విషయం విదితమే.. కాగా,



వల్లభనేని వంశీ రిమాండ్‌ను మార్చి 11వ తేదీ వరకు పొడిగించింది కోర్టు.. వంశీ సహా నిందితుల రిమాండ్ పొడిగించారు. ఈ క్రమంలో.. వంశీతో పాటు మరో ఇద్దరిని పోలీసులు మూడు రోజులు కస్టడీలోకి తీసుకున్నారు. అతనిపై మరో రెండు కేసులు నమోదు చేశారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో రైతులకు ప్రభుత్వం అందించిన పరిహారం అందించకుండా 128 మంది రైతులను మోసం చేయడంపై కేసు నమోదు చేశారు. అలాగే తెలప్రోలుకు చెందిన శ్రీధర్ రెడ్డి వివాదం సెట్టిల్మెంట్‌లో పొలం రిజిస్ట్రేషన్ చేయిస్తానంటు భూమిని కబ్జా చేసినందుకు వంశీ ఆయన అనుచరులుపై మరో కేసు నమోదు అయింది.

సీట్ ఏర్పాటు తరువాత నిన్న ఒక్క రోజే గన్నవరం నియోజకవర్గంలో వంశీ ఆయన అనుచరులుపై మొత్తం మూడు కేసులు నమోదు నమోదయ్యాయి. వంశీపై నమోదైన కేసుల అన్ని సీట్‌కు ఇవ్వాలని పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించారు. మరోవైపు వంశీ మూడు రోజుల కస్టడీని రద్దు చేయాలని కోరుతూ కోర్టులో మంగళవారం మెమో దాఖలైంది. నిందితుల తరఫు న్యాయవాది తానికొండ చిరంజీవి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానంలో ఆ మెమో దాఖలు చేశారు. కోర్టు ఆదేశాల ప్రకారం నిందితులను విచారించే ప్రదేశం ముందుగా వారి తరఫున న్యాయవాదులకు తెలియజేయాలని, విచారణ సమయంలో మూడు నుంచి నాలుగుసార్లు నిందితులతో న్యాయవాదులు మాట్లాడుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ విషయాలను దర్యాప్తు అధికారులు తమకు తెలియజేయలేదని, అందువల్ల పోలీసు కస్టడీని రద్దు చేయాలని కోరారు. కాగా పోలీసుల విచారణ సమయంలో ఆహారం ముట్టుకోవడానికి వంశీ ఇష్టపడలేదని తెలిసింది. వంశీని విచారిస్తున్న ఏసీపీ దామోదర్ మధ్యాహ్నా సమయంలో భోజనం చేయమని అడిగారు. తాను భోజనం చేయనని వంశీ సమాధానం ఇచ్చారు. తాగడానికి నీళ్ల మాత్రం ఇవ్వమని కోరారు. మిగిలిన ఇద్దరు నిందితులు భోజనాలు చేశారు.

# ఇది చిన్నపిల్లల కొట్లాట

## - హిందీ వివాదంపై విజయ్



**చెన్నై :** హిందీ భాష విషయంలో రాష్ట్ర డిఎంకె, కేంద్ర ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతోంది. దీనిపై తమిళగ వెట్రి కళగం (టివికె ) అధ్యక్షుడు , నటుడు విజయ్ తాజాగా స్పందించారు. ఇది చిన్నపిల్లల కొట్లాటలా ఉందంటూ ఎద్దేవా చేశారు. టీవీకే తొలి వార్షికోత్సవంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నూతన విద్యావిధానం (ఎన్ఇపి), త్రిభాష సూత్రం అమలుపై ఆ రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. డిఎంకె, బీజేపీ రెండూ పెద్ద పార్టీలైనా సామాజిక మాధ్యమాల్లో హ్యాష్‌ట్యాగ్ గేమ్స్ ఆడుకుంటున్నాయి. ప్రజలను తప్పుతోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నాయి.వారి వివాదం చిన్న పిల్లల కొట్లాటలా ఉంది అని ఎద్దేవా చేశారు. డీఎంకే వ్యతిరేకిస్తున్న త్రిభాషా విధానాన్ని విజయ్ కూడా వ్యతిరేకించారు. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. త్రిభాషా సూత్రం అమలును అంగీకరించకపోతే రాష్ట్రానికి రావలసిన రూ.2400 కోట్ల నిధులను నిలిపివేస్తామంటూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బెదిరించడంపై తీవ్రంగా స్పందించారు. కేంద్రం తీరును తప్పు పట్టారు. బీజేపీ, డీఎంకే నిజాయితీ లేని పార్టీలని దుయ్యబట్టారు. వారిని అధికారం నుంచి దించేయడమే మేలని , గెట్‌ఔట్ హ్యాష్‌ట్యాగ్ పెట్టి వారిని సాగనంపడమే లక్ష్యంగా కలసికట్టుగా కృషి చేద్దామంటూ ప్రజలకు పిలుపునిచ్చారు.

## కుంభమేళాకు వెళ్లని రాహుల్, థాక్రేలను బహిష్కరించాలి



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ థాక్రే మహాకుంభమేళాను సందర్శించకుండా హిందూ సమాజాన్ని అవమానపరిచారని, అందుకు గాను హిందూఓటర్లు వారిని బహిష్కరించాలని కేంద్ర మంత్రి రాందాస్ ఆథవదే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో వారి పార్టీలకు ఓట్లేయ వద్దని సూచించారు. తరచూ సమావేశాల్లో హిందుత్వం గురించి మాట్లాడే థాక్రే ఈ విధంగా ప్రవర్తించడం సరైన చర్య కాదని మండి పడ్డారు. ఈ విషయంలో వారు కనీసం ప్రజల మనోభావాలను పరిగణన లోకి తీసుకోవాల్సిందని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో హిందూ ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి , ఉద్ధవ్‌థాక్రేకు తగిన గుణపాఠం చెప్పినా, వారి తీరులో ఎటువంటి మార్పు లేదని దుయ్యబట్టారు.

## శ్రీశైలంలో శివరాత్రి వేడుకుల్లో విషాదం

### నదీస్నానంలో ముగ్గురు గల్లంతు

**నంద్యాల:** శ్రీశైలంలో తీవ్ర విషాదం నెలకొంది. దర్శనానికి వెళ్లిన ముగ్గురు భక్తులు ప్రమాదానికి గురయ్యారు. మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వేకువజాము నుంచే భక్తులు పెద్దఎత్తున పోటెత్తుతున్నారు. పుణ్యస్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలోనే ముగ్గురు స్నేహితులు దర్శనానికి వెళ్లారు. అనంతరం లింగాలగట్టు వద్ద స్నానాలు చేసేందుకు నీటిలోకి దిగారు. అయితే స్నానం చేస్తూ కొంచెం లోపలికి వెళ్లడంతో ఈత రాక ఒకరు మునిగిపోయారు. స్నేహితుడిని కాపాడేందుకు వెళ్లిన మిగతా ఇద్దరూ గల్లంతయ్యారు. ప్రమాదాన్ని గమనించిన తోటి భక్తులు సమాచారాన్ని వెంటనే స్థానిక అధికారులు అందించారు. దీంతో అప్రమత్తమైన అధికారులు భక్తులను కాపాడేందుకు చర్యలు చేపట్టారు. గజఈతగాళ్ల రంగంలోకి దింపారు. నది మొత్తం జల్లెడపడుతూ గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, పండగ వేళ భక్తులకు ప్రమాదం జరగడంతో శ్రీశైలం ఆలయ పరిసరాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## స్టాలిన్‌కు కేటీఆర్ మద్దతు



హైదరాబాద్,: నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమర్థించారు. డీలిమిటేషన్‌పై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమర్థించారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణ భారత దేశానికి అన్యాయం జరుగుతుందన్న వ్యాఖ్యలకు మద్దతిచ్చారు. దేశానికి అత్యవసరమైనప్పుడు కుటుంబ్ర నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించడం తగదని అన్నారు. దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాల పాత్రను పరిగణనలోకి తీసుకోకుండా నియోజకవర్గాల పునర్విభజన చేయడం ప్రజాస్వామ్య, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని కేటీఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిజంగానే నియోజకవర్గాల పునర్విభన చేయాలని భావిస్తే.. అది దేశానికి అందించే ఆర్థిక సహకారం వాటా ఆధారంగా ఉండాలని ప్రతిపాదించారు. దేశ నిర్మాణానికి తెలంగాణతో సహా దక్షిణాది రాష్ట్రాలు చేస్తున్న కృషిని ఎవరూ విస్మరించలేరని అన్నారు. దేశ జనాభాలో తెలంగాణ జనాభా కేవలం 2.8 శాతం మాత్రమే ఉందని.. కానీ దేశ జీడీపీలో మాత్రం 5.2 శాతం కంటే ఎక్కువ వాటా అందిస్తోందని పేర్కొన్నారు.

## మద్యం ప్రియులకు జడ్జి సరికొత్త శిక్ష



నంద్యాల,ఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి : :బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పోలీసులకు పట్టుబడిన వారికి నంద్యాల జిల్లా బనగానపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సరికొత్త శిక్ష విధించింది. మద్యం అనర్థాలు, రహదారి నిబంధనలపై ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో నిల్చోవాలని తీర్పునిచ్చింది. పలు గ్రామాలకు చెందిన 47 మంది మద్యంప్రియులను గుర్తించి న్యాయస్థానం ఎదుట పోలీసులు హాజరుపరిచారు. వారిలో పరివర్తన కోసం న్యాయమూర్తి షేక్ అబ్దుల్ రెహ్మాన్ ఈ ఉత్తర్వులిచ్చారు.

# శివాలయాలకు పోటెత్తిన భక్తజనం

### నదీ,సముద్ర స్నానాలతో తరించిన భక్తజనం -పంచారామ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు



అమరావతి,ఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి :శివరాత్రిని పురస్కరించుకుని ప్రధాన ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పంచాయారమ క్షేత్రాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నదీస్నానాలు, సముద్ర స్నానాలు చేసి శైవాలయాల్లో పూజలు నిర్వహించారు. అమరావతి, ద్రాక్షారామం, పాలకొల్లు, విజయవాడ, శ్రీశైలం, మహానంది, కాళహస్తి తదితర పుణ్యక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో పాల్గొన్నారు. శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి.విజయవాడ కృష్ణానదిలోని పున్నమిఘాట్, కృష్ణవేణి, పవిత్ర సంగమంలో భక్తులు పుణ్యస్నానాలతో మొక్కులను చెల్లించుకుంటున్నారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయనాకి భక్తులు పోటెత్తారు. శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసారు. తెల్లవారుజామునుంచే శివుడికి భక్తులు శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి..స్వామివారిని దర్శించుకున్నారు. జగ్గయ్యపేట మండలం ముత్యాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి కృష్ణానదిలో భక్తులు స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. తోట్లవల్లూరు మండలం ఐలూరు రామేశ్వరస్వామి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా శైవలయాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంది. త్రిపురాంతకం, భైరవకొన, జమ్ములపాలెం, సోపిరాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రిని పుస్కరించుకుని పట్టిసీమ కేత్రానికి భక్తులు తరలివచ్చారు. అటు పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. మరోవైపు పట్టిసీమ పట్టిసాచలక్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. గోదావరిలో పుణ్యస్నానాలు చేసి స్వామిని దర్శించుకున్నారు. వీరభద్రేశ్వర స్వామికి వంశపారంపర్య ధర్మకర్తలు తొలిపూజ నిర్వహించారు. సామర్లకోట కుమారరామ భీమేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ద్వారకాతిరుమల శేషాచల కొండపై శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శివనామస్మరణతో శివాలయం మారుమోగుతోంది. స్వామివారికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. తిరుపతి కపిలతీర్థంలో శివరాత్రి సందర్భంగా భక్తులు పోటెత్తారు. కపిలతీర్థం జలపాతం దగ్గర భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆపై మహిళలు పిండి దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. రాజమండ్రి పుష్కర ఘాట్, కోటిలింగాల ఘాట్‌లో భక్తులు పోటెత్తారు. ఏలేశ్వరంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఏలేరు నది తీరంలో భక్తుల పుణ్యస్నానాలు ఆచరించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని పంచారామ క్షేత్రం సోమారామంకు భక్తులు పోటెత్తారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# కృష్ణా డెల్టాకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరా

### వేసవిలో పంటలకు సరిపడా నిల్వలు -మంత్రి అచ్చన్నాయుడు



అమరావతిఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి : కృష్ణా డెల్టా పరిధిలో ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఏలూరు, ప్రకాశం జిల్లాల్లో వేసవిలో నీటి కొరత రాకుండా జలవనరుల శాఖ ప్రణాళిక సిద్ధం చేసిందని మంత్రి అచ్చన్నాయుడు అన్నారు. గత ఐదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా నీటిని ప్రణాళికా బద్దంగా ఉపయోగిస్తామని అన్నారు. ఉన్ననీటిని సాగు,తాగు నీటి అవసరాలకు వాడుకునేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రస్తుతం కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలో సాగులో ఉన్న పంటలకు నీరిస్తూనే... తాగు అవసరాలకు అనుగుణంగా కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించారు. పులిచింతల, ప్రకాశం బ్యారేజీలో నిల్వ నీటిని సమర్థంగా ఉపయోగిస్తూనే.. వచ్చే ఖరీఫ్‌లో పంటల సాగుకు ప్రారంభంలో నీటి విడుదలకు వీలుగా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని అన్నారు. కృష్ణా డెల్టా పరిధిలో 13 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఖరీఫ్, రబీ సీజన్‌లో పుష్కలంగా సాగునీరు సరఫరా చేశారు. కృష్ణానదికి గతేడాది నీటిప్రవాహం ఉండటం, అవసర మైనప్పుడు గోదావరి నది నీటిని పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోసి ప్రకాశం బ్యారేజీకి తరలించి పంటలకు సాగునీరు అందించారు. సాగునీటి సమస్య లేకపోవడంతో పెట్టుబడి వ్యయమూ తగ్గింది. రబీలోనూ పంటలు పూర్తయ్యే వరకు నీటివిడుదల కొనసాగుతుండటంతో రైతులకు కలిసొచ్చింది. ప్రస్తుతం మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న పంటలు సాగులో ఉన్నాయి. కాలువల చివర, సముద్రతీర ప్రాంత ఆక్వా చెరువులకు కూడా ఈసారి నీటిసమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికలతో నీటి వనరుల సద్వినియోగంతో అన్నదాతల కష్టాలు తొలగాయని వివరించారు. తూర్పు డెల్టాలోని పంటలు తుదిదశకు చేరుకున్నాయి. ఇక్కడ పెద్దగా సాగునీటి అవసరాలు లేవు. పశ్చిమ డెల్టా పరిధిలో మొక్కజొన్న, జొన్న సాగు ఎక్కువగా ఉండటం, కొంత ఆలస్యంగా రబీలో పంటలు వేయడంతో మార్చి నెలాఖరు వరకు సాగునీటి అవసరాలు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్ 15 వరకు తూర్పు డెల్టా కాలువలకు, పశ్చిమ డెల్టా కాలువలకు నీరిచ్చేలా రోజువారీ ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు. తాగునీటి చెరువులను నింపుతూ నీటి విడుదల ఆపే నాటికి వంద శాతం నీటినిల్వ సామర్థ్యంతో ఉండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తాగునీటి చెరువుల్లో నిల్వ చేసిన నీరు సగటున 90 రోజుల వరకు సరఫరాకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఈలెక్కన జులై నెలలో మళ్లీ కాలువలకు నీటిని విడుదల చేస్తారు. పులిచింతల ప్రాజెక్టులో సరిపడా నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం నీటివిడుదల కొనసాగుతున్న వాటితో లెక్కిస్తే ఏప్రిల్ 15 నాటికి పులిచింతలలో 20 టీఎంసీల నీరు ఉంటుందని భావిస్తున్నారు. దీనిని నిల్వచేసి రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ముందస్తుగా నారుమళ్లు వేసుకోవడానికి, వర్షాలు ఆలస్యమైతే తాగునీటి అవసరాలకు అనుగుణంగా విడుదల చేయనున్నారు. పులిచింతల, ప్రకాశం బ్యారేజీలో వేసవిలో సైతం నీటిని నిల్వ చేయడంతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలకు లోటుండదని అధికారులు అంటున్నారు. ప్రభుత్వం ముందుచూపుతో గోదావరి నీటిని ప్రకాశం బ్యారేజీకి తరలించి పులిచింతలలో నీటినిల్వలు తగ్గకుండా చూడటంతో ఇప్పుడు అవసరాలకు పులిచింతల నీరు అక్కరకు వస్తోందని తెలిపారు.

# పెద్దల సభకు స్థానం దక్కేనా ..?

## - అధిష్టానం అనుగ్రహం కోసం ఎదురుచూపులు



అమరావతిఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి :

ఏపీలోని ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల్లో ముగ్గురు అభ్యర్థులు దాదాపు ఫైనల్ అయినట్లేనని ప్రచారం జరుగుతోంది. మొత్తం ఐదు ఖాళీలు ఉండగా, అన్ని స్థానాలు కూటమి దక్కించుకునే అవకాశం ఉంది. మిత్రపక్షాల్లో జనసేనకు ఒక సీటు కేటాయించనుండగా, ఆ సీటు నుంచి మెగా బ్రదర్ నాగబాబు ఫైనల్ అంటున్నారు. ఇక బీజేపీకి ఎమ్మెల్సీ అవకాశం ఇస్తారా? లేదా? అన్నదే సస్పెన్స్ గా మారింది. అదేవిధంగా టీడీపీ నుంచి ఇద్దరి పేర్లు దాదాపు ఖరారు అయ్యాయంటున్నారు. ఇక మిగిలిన ఇద్దరు ఎవరన్నదే ఉత్కంఠ రేపుతోంది. ఏపీ ఎమ్మెల్సీ రేసు ఎన్డీఏ కూటమిలో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిస్థాయి పదవులకు తొలిసారి ఎన్నిక జరుగుతుంది. దీంతో ఆరేళ్ల పదవీకాలం ఆశిస్తున్న నేతలు పదవుల కోసం పైరవీలు చేస్తున్నారు. కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరిశీలనలో కొందరి పేర్లు ఇప్పటికే ఫైనల్ అయ్యాయనే ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా డిప్యూటీ సీఎం పవన్ కోసం ఎమ్మెల్యే సీటు త్యాగం చేసిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎన్ వర్మ, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసి టీడీపీలో చేరిన మోపిదేవి వెంకటరమణ, మెగా బ్రదర్ నాగబాబు దాదాపు ఫైనల్ అంటున్నారు. ఇక మిగిలిన రెండింటిని టీడీపీ తీసుకుంటుందా..? లేక బీజేపీకి ఓ స్థానిమిస్తుందా? అనేది చర్చకు తావిస్తోంది. టీడీపీలో రెండు స్థానాలకు విపరీతమైన పోటీ ఉండగా, బీజేపీ నేతలు కూడా ఎమ్మెల్సీ పదవిపై ఆశలు పెట్టుకుంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడే చట్టసభలో అడుగుపెట్టే అవకాశం దక్కించుకోవాలని తహతహలాడుతున్నారు. ఆ పార్టీలో సోము వీర్రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, జీవీఎల్ నరసింహరావు, పాతూరి నాగభూషణం, పీవీఎస్ మాధవ్ ఇలా చాలా మంది నేతలు ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో పార్టీ అగ్ర నేతల ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఒత్తడి తేవాలని వారు ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. అయితే ఎవరికి అవకాశం ఇవ్వాలన్నా మూడు పార్టీలు కలిపి సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాల్సివుంటుందని అంటున్నారు. దీంతో ఓసీ సామాజికవర్గం నుంచి వర్మ, కాపు సామాజికవర్గం నుంచి నాగబాబు, బీసీ మత్స్యకార సామాజికవర్గం నుంచి మోపిదేవి పేర్లు దాదాపు ఖరారైనందున ఆయా సామాజికవర్గాలు జిల్లాల నుంచి వేరొకరికి అవకాశం దక్కదని ప్రచారం జరుగుతోంది. దీంతో ఉభయ గోదావరి, క్రిష్ణా డెల్టా ప్రాంతం నేతలు గవర్నర్ కోటాలో ఖాళీ అయ్యే స్థానాల కోసం వేచిచూడక తప్పని పరిస్థితి ఉందంటున్నారు. దీంతో రాయలసీమ జిల్లాలతోపాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కోటాలో నేతలు ఎమ్మెల్సీ చాన్స్ కోసం ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా రాయలసీమలో ఎప్పుడూ లేనన్ని సీట్లు గెలుచుకున్నా, ఆ ప్రాంతంలో బలమైన స్థితికి చేరుకోవాలంటే నాయకత్వాన్ని ఇంకా పటిష్టం చేసుకోవాలనే ఆలోచనతో టీడీపీ, జనసేన అగ్రనేతలు ఆలోచనగా చెబుతున్నారు. దీంతో రాయలసీమకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ నేతలకు అవకాశాలు దక్కే పరిస్థితి ఉందంటున్నారు. మొత్తానికి ఐదు ఎమ్మెల్సీల్లో రెండింటిపైనా ఎక్కువ సస్పెన్స్ కొనసాగుతోందంటున్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## శ్రీశైలం ఆలయ విమాన గోపురానికి

# ఘనంగా పాగాలంకరణ.!

### శివ నామస్మరణతో మార్మోగిన శ్రీశైల క్షేత్రం..!

**-అశేష భక్తజన వాహిని మధ్య భక్తిశ్రద్ధలతో పాగాలంకరణ, లింగోద్భవ మహన్యాస రుద్రాభిషేకం.**

**-రమణీయం...కమనీయం... నయనానందకరంగా స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం**

**వేడుకలకు హాజరైన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, శ్రీశైలం ఎమ్మెల్యే**





**ఆంధ్ర ప్రగతి శ్రీశైలం/నంద్యాల, ఫిబ్రవరి 26:** శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీ మల్లికార్జున స్వామివారికి పాగాలంకరణ ఘనంగా ముగిసింది. బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలమహాక్షేత్రంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం లింగోద్భవం సమయంలో చీరాల వాస్తవ్యులు పృధ్వి వెంకటేశ్వర్లు ఎంతో నిష్టతో భక్తిశ్రద్ధలతో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున అమ్మ వార్లను తలుచుకుంటూ స్వామివారికి పాగా చుట్టి అలంకరించారు. రోజుకు మూర చొప్పున నేత నేస్తూ 365 రోజులు పాటు తయారు చేసిన పాగాను స్వామివారికి సమర్పించి ఆలయ సాంప్రదాయబద్ధంగా పాగాను అలంకరించారు. ఈ పాగాలంకరణ ఘట్టం దాదాపు గంటన్నర పాటు జరిగింది. ఈ ఘట్టంలో భక్తులు శివనామస్మరణతో శ్రీశైల మహా పుణ్యక్షేత్రం మారుమోగింది. అనంతరం రమణీయం... కమనీయం గా నయనానందకరంగా నాగలకట్ట సమీపంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల కల్యాణ తంతు వైభవోపేతంగా సాంప్రదాయ రీతిలో జరిగింది. అశేష భక్త జనవాహిని మధ్య కళ్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా జరిగాయి. ఈ ఉత్సవ వేడుకలలో జిల్లా కలెక్టర్ జి రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, శ్రీశైల దేవస్థానం బ్రహ్మోత్సవాల చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మహానందీశ్వరుడికి శ్రీవారి తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన టీటీడీ.






**ఆంధ్ర ప్రగతి మహానంది, ఫిబ్రవరి 26:** మహానంది క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్స వాల్లో భాగంగా జరిగే కల్యాణానికి శ్రీవారి తరఫున తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలను ఆలయ ఏ ఈవో మోహన్ రాజు దంపతులతోపాటు సూపర్నెంట్లు, ఆలయ సిబ్బందితో తీసుకొచ్చారు. బుదవారం మహానంది చేరుకొన్న వీరికి ఆలయ ముఖ మంటపం వద్ద ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, ఆధ్వర్యంలో వేదపండితులు, స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్ల ఆలయాల్లో అర్చకులకు పట్టు వస్త్రాలను ఈవో దంపతులు అందజేశారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరునికి, కామేశ్వరీ దేవికి అభిషేకార్చన పూజలను నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో వీరిని వేదపండితులు శాలువాతో సన్మానించగా ఈవో, స్వామివారి మెమెంటో, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మధు, సూపర్నెంట్లు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అఖిలభారత ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన పోటీలకు మంత్రి ఫరూక్ కు ఆహ్వానం.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 26:** మహానంది పుణ్యక్షేత్రం నందు శ్రీ కామేశ్వరి దేవి సహిత శ్రీ మహానందిశ్వర స్వామి వార్ల సన్నిధిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన అఖిల భారత ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలకు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు, నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ కు ఆహ్వాన పత్రికను కమిటీ నిర్వాహకులు అందజేశారు

## మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎండి ఫిరోజ్.





ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 26: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నంద్యాల పట్టణంలోని ప్రధమనంది దేవస్థానం నందు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు . అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ శివుడి అనుగ్రహంతో ప్రజలందరి జీవితాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ, మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు సంతృప్తికరంగా అందాలని, ప్రతీ ఇల్లు శోభాయమానంగా వెలుగొందాలని పార్వతీ పరమేశ్వరులని వేడుకున్నారు. శివుని దర్శనార్థం వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని ఆలయ కమిటీ వారికి తెలిపారు. అనంతరం ఫిరోజ్ ని వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధమనంది దేవస్థానంకార్యనిర్వహణాధికారి గోపి , ప్రధాన అర్చకులు ప్రవీణ్ , రాఘవేంద్ర శర్మ , కామిని మల్లికార్జున , గోవింద నాయుడు , బుగ్గ రాముడు మారుతీ ప్రసాద్ , ఉప్పరి సురేష్ కుమార్ , బద్రిశెట్టి రవి , శివశంకర్ , భాస్కర్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివుని ఆరాధనలో భాగస్వాములయ్యారు.

## మన భారతీయ మహిళా వైద్యురాలు ఆనందీబాయి జోషికి ఘననివాళి.

**-సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.**



**ఆంధ్ర ప్రగతి డోన్ ఫిబ్రవరి 26:** మొట్టమొదటి భారతీయ మహిళా వైద్యురాలు ఆనందీబాయి జోషి వర్థంతి సందర్భంగా మరియు స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్రప్రదేశ్ శాసనసభకు మొదటి శాసన సభాధిపతి అయ్యదేవర కాళేశ్వరరావు వర్థంతి సందర్భంగా డోన్ పట్టణం నందు సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో పాశ్చాత్య వైద్యంలో పట్టాపొందిన మొట్టమొదటి భారతీయ మహిళా వైద్యురాలు ఆనందీబాయి వర్థంతి సందర్భంగా మరియు స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్రప్రదేశ్ శాసనసభకు మొదటి శాసన సభాధిపతి అయ్యదేవర కాళేశ్వరరావు వర్థంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు. ఆనందీబాయి పూణే (మహారాష్ట్ర) లోని బ్రాహ్మణ కుటుంబంలో మార్చి 31, 1865 జన్మించారు. వైద్యంలో పట్టాపొందిన మొట్టమొదటి భారతీయ మహిళా వైద్యురాలు. ఆనందీబాయి ఒక బాలుడికి జన్మనిచ్చింది. అవసరమైన వైద్య సంరక్షణ అందుబాటులో లేకపోవడంతో బాలుడు పది రోజుల్లో చనిపోయాడు. ఈ సంఘటన ఆనందీబాయి జీవితంలో ఒక మలుపును తీసుకొచ్చింది. తను వైద్యురాలు కావడానికి ప్రేరణనిచ్చింది. వైద్యం చదవడానికి అనేక కష్టాలు ఎదిరించి వైద్య పట్టాను సాధించింది. మన దేశంలో అనేక మంది స్త్రీలకు ఆదర్శంగా నిలిచి ఎందరో మహిళలు ఈమె ప్రేరణతో ముందుకు సాగారు. ఆమెను కొల్హాపూర్ సంస్థానానికి చెందిన వైద్యురాలిగా నియమించింది. అల్బర్ట్ ఎడ్వర్డ్ వైద్యశాలలోని మహిళా వార్డుకు అధికారిణిగా బాధ్యతలను అప్పగించింది. ప్రజలకు సేవలందిస్తూ ఆనందీబాయి జోషి - ఫిబ్రవరి 26, 1887 స్వర్గస్తులైనారు. ఇటువంటి సంఘ సేవకులను మహనీయులను అనుసరిస్తూ వారి అశయాలను ముందుకు తీసుకుపోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు.

## ఏపీయూడబ్ల్యూజే యూనియన్ డైరీని ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 26:ఏపీయూడబ్ల్యూజే యూనియన్ డైరీని రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆధ్వర్యంలో ప్రచురించిన యూనియన్ డైరీని రాష్ట్ర న్యాయ , మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ఏపీడబ్ల్యూజె కృషి చేస్తుందని, యూనియన్ కు తమ మద్దతు, సహకారం ఎల్లప్పుడూ ఉంటాయని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఖండే శ్యామ్ సుందర్ లాల్, నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్సులు మధుబాబు, ఉస్మాన్ బాషా, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చలం బాబు యూనియన్ సభ్యులు సురేష్, భరత్, విలేఖరులు నరసింహమూర్తి, అభిమన్యు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా లో మరణించిన కుటుంబాన్ని

# పరామర్శించిన ఎన్.ఎం.డి ఫిరోజ్.







ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 26: మంత్రివర్యులు ఎన్.ఎం.డి ఫరూక్ కుమారుడు తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఎం. డి ఫిరోజ్ ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో ఒక మహిళ చనిపోయారు మరియు గాయాలు జరిగిన 35 మంది మహిళలను పరామర్శించి వారి యోగక్షేమాలు తెలుసుకోవడం జరిగింది. సాయంత్రం మూడు గంటల సమయంలో ట్రాక్టర్ బోల్తా పడి సుమారు 35 మంది మహిళలకు గాయాలతో పాటు ఒక మహిళ చనిపోవడం జరిగినది. అందులో 8 మంది మహిళలకు కాళ్లు చేతులు విరగడంతో పాటు వారిలో ఒకరికి నడుము విరిగినది. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి విషయాలు పాణ్యం నియోజకవర్గం తొగర్చేడు గ్రామానికి చెందిన మహిళలు ఊరుమార్పురం గ్రామానికి వచ్చి పొగాకు దోరణాలు కుట్టి సాయంకాలం తిరిగి వారి ఇండ్లకు చేరుకోవడానికి ట్రాక్టర్ పైన తొగర్చేడు గ్రామానికి బయలుదేరారు. అయితే రెండు గ్రామాలకు మధ్యలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో సుమారు మూడు గంటల సమయమున ఘోర ప్రమాదం జరిగినది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మరణించడం జరిగినది. మిగతా 32 మంది మహిళలకు తీవ్ర గాయాలతో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి నందు చేరారు. అందులో 8 మందికి కాళ్లు చేతులు విరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ వారి కుమారుడు తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ హుటాహుటిన బయలుదేరి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో క్షతగాత్రులను ప్రతి ఒక్కరిని పరామర్శించి మేము అండగా ఉంటాం మీరు ఎలాంటి ఆందోళన చెందవద్దు. డాక్టర్లు అన్ని వైద్య మెరుగై సౌకర్యాలు కల్పిస్తారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన భరోసిచ్చారు. అదేవిధంగా పాణ్యం నియోజకవర్గం ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డి కి ఫోన్ చేసి జరిగిన సంఘటన వివరాలను వివరించడం జరిగింది. గౌరవ వెంకట్ రెడ్డి గారు ఉదయం అనగా 26-02-2025 విజయవాడ నుంచి బయలుదేరి వారిని పరామర్శించుటకు వస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎం.డి ఫిరోజ్ తో పాటు. నంద్యాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు మునియార్ ఖలీల్, న్యాయవాది తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త డాక్టర్ జి. బాలస్వామి, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ముద్దం నాగ నవీన్ , ఎమ్మార్పీఎస్ నాయకుడు బెనర్జీ, రమణారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయనతోపాటు పాల్గొని పలువురిని పరామర్శించడం జరిగినది. తదనంతరం వారందరికీ తెలుగుదేశం పార్టీ మనసున్న మహా నాయకుడు ఎన్.ఎం.డి ఫిరోజ్ సుమారు 10:30 నుండి 11:30 గంటల వరకు వారి మధ్యన ఉండి ధైర్యం చెబుతూ మెరుగైన వైద్య సేవలు అందించుటకు డాక్టర్లు అందుబాటులో ఉండారు మీరందరూ ఎలాంటి ఆందోళన చెందొద్దని వారికి ధైర్యం చెప్పాడు. ఆయనతోపాటు డాక్టర్ ఎన్.ఎం.డి సోహెల్ గారు ప్రత్యేక శ్రద్ధ చూపి వారికి మెరుగైన వైద్య సేవలు అందించారు. తదనంతరం గాయపడిన వారికి వారి కుటుంబ సభ్యులకు భోజన సౌకర్య కల్పించడం జరిగినది.

# నంద్యాలలో మినీ చికెన్ మేళకు భారీ స్పందన.









ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 26:
చికెన్ అంటే ఇష్టపడని మాంసాహార ప్రియులు ఉండరు. ఆదివారం వచ్చిందంటే తమకు ఇష్టమైన చికెన్ ను తినడం కోసం ఎంతైనా ఖర్చు చేస్తుంటారు. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ ప్రచారాలతో తగ్గిన చికెన్ అమ్మకాలను పెంచుకునేందుకు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు మినీ చికెన్ మేళ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ హాజరయ్యారు. స్థానిక చికెన్ దుకాణాల యజమానుల ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా చికెన్, చికెన్ పకోడి, చికెన్ లాలీపాప్ , ఉడకబెట్టిన కోడిగుడ్లను అందజేశారు.
ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ , జిల్లా కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ చికెన్ మంచి పోషకాహారమని దీనిని తినడం సురక్షితమే అన్నారు. 70 డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే ఎక్కువ వేడిలో చికెన్, గుడ్లు వండడం వలన ఒక వేళ బర్డ్ ఫ్లూ వైరస్ ఉన్నా చనిపోతుందన్నారు. ప్రజలలో ఉన్న అపోహలను తొలగించేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు అపోహలు నమ్మవద్దని హ్యాపీగా చికెన్ తినొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పట్టణ అధ్యక్షులు మునియార్ ఖలీల్, డీసీ మెంబర్ చాబోలు ఇలియాస్, నంద్యాల మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మాండ్ల గుర్రప్ప , రైతునగరం హరిబాబు, చికెన్ షాపులో యజమానులు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓంకారం దేవస్థానంలో రెడ్ క్రాస్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన....

**రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి డాక్టర్ మమత రెడ్డి.**


**-గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రొక్కం నాగేశ్వరరెడ్డి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 26:**
పవిత్ర పుణ్య క్షేత్రమైన ఓంకారంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత ప్రథమ చికిత్స వైద్య శిబిరాన్ని జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి డాక్టర్ ఆర్. మమత రెడ్డి మరియు గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రొక్కం నాగేశ్వర రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బండి ఆత్మకూరు మండల సబ్ బ్రాంచ్ రెడ్ క్రాస్ కన్వీనర్లు షరీఫ్ శ్రీనివాసులు, గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాలుడు మరియు రెడ్ క్రాస్, గ్రామీణ వైద్యులు సభ్యులు మోహన్, భరత్, నరసింహుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.









## నేడుఇస్కాన్ అహోబిలం ఆధ్వర్యంలో శ్రీ అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి పార్వేట మహోత్సవం.

ఆంధ్ర ప్రగతి రుద్రవరం ఫిబ్రవరి 26:
మండలంలోని ఇస్కాన్ అహోబిలం హరినగరం దగ్గర నేడు శ్రీ అహోబిల లక్ష్మీనరసింహస్వామి పా ర్వేట మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ అహోబిలం ఇంచార్జ్ చంద్రకేశవ దాసు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నేడు సాయంత్రం 5గంటలకు ఇస్కాన్ భక్తులచే కీర్తనలు, 6 గంటలకు తులసి హారము, 6.45 నిమిషాలకు నరసింహ కీర్తనలు, 7 గంటలకు అతిథులకు సత్కారము, అనంతరము భోజన ప్రసాదం, 7.30 నిమిషాలకు ముఖ్య అతిథులచే ప్రవచనాలు, 8 గంటలకు వీర మోహన్ నాగసానిపల్లి సంగీతం భరత్ కుమార్ సారథ్యంలో సత్యమ్మ తల్లి చాగలమర్రి భజన బృందం చే చెక్కభజన కార్యక్రమం ప్రదర్శన, 12:30 కు లక్ష్మి నరసింహ స్వామి కి ఇస్కాన్ భక్త బృందం వారిచే కీర్తనలు పూలు మరియు దీప హారతులతో ఆహ్వానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 27వ తేదీ ఉదయం 4 గంటలకు మంగళ హారతి 5గంటలకు ఇస్కాన్ భక్త బృందం భక్తుల అంగరంగ వైభవంతో లక్ష్మి నరసింహ స్వామి అహోబిలం ప్రయాణము సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.




## యాగంటిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు

**ఆలయంలో మంత్రి బీసీ దంపతుల పూజలు**

నంద్యాల,ఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి :
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి అమ్మ వార్లకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.. ఇందిరమ్మ దంపతులు దర్శించుకున్నారు.. యాగంటి ఆలయ క్షేత్రానికి చేరుకున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దంపతులకు ఆలయం మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు, ఆలయ సంప్రదాయబద్ధంగా తలపాగా ధరించిన మంత్రి స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను భక్తిశ్రద్ధలతో తలపై ఉంచుకొని ఉమా మహేశ్వర స్వామి వారి సన్నిధికి చేరుకున్నారు.. ఏకశిలపై కొలువున్న ఉమామహేశ్వరులకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దంపతులు విశేష అభిషేక ప్రత్యేక పూజలను నిర్వహించారు, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా, ఉదయం 5 గంటల నుండి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్రనామావళి, వంటి విశేష పూజలను, వేద పండితుల మంత్రోచ్చారణాలతో ఆలయ అర్చకులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు, , యాగంటిలో స్వామి అమ్మ వారిని దర్శించు కునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భారీ ఎత్తున తరలి వచ్చిన భక్తులు క్యూలైన్ల లో నిలిచి ఉన్నారు, స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు రెండు గంటల సమయం పడుతున్నట్లు భక్తులు వెల్లడించారు.

## మహాశివరాత్రి జాగరణకు భారీ బందోబస్తు.

**-ఏ ఎస్ పి మందా జావలి**



బండి ఆత్మకూర్. ఆంధ్రప్రగతి ఫిబ్రవరి 26:
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శైవ క్షేత్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మందా జావలి తెలిపారు బుధవారం ఓంకార సిద్దేశ్వర స్వామి ని దర్శించుకోవడం జరిగింది ఏ ఎస్ పి మందా జావలికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వచనాలతో వేద పండితులు ఆశీర్వదించడం జరిగింది ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ మరియు చిన్న చిన్న నేరాలు జరగకుండా బందోబస్తు కఠినంగా నిర్వహించాలని సిఐ,ఎస్ఐ లను ఆదేశించడం జరిగింది. నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ఆ పాయింట్ దగ్గర బందోబస్తు కఠిన తరం చేయాలని అదే విధంగా మహిళలు పెద్ద ఎత్తున జాగరణ కోసం వస్తున్న సందర్భంగా మహిళలకు భద్రత కల్పించాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించాలని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో జగన్మోహన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# ట్రాక్టర్ బోల్తాపడి మరణించిన కుటుంబాన్ని ఆదుకోవాలి.

**-సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం.**





ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 26:
పాణ్యం మండలం తొగర్చేడు గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో చనిపోయిన మహిళను గాయపడిన వారిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి లో బుధవారం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వి బాల వెంకట్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు డేవిడ్, రత్నమయ్య, జయన్న లతో కలిసి పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చనిపోయిన మహిళ కుటుంబాన్ని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని మరియు తీవ్ర గాయాలతో చేతులు కాళ్లు నడుము విరిగిన మహిళలకు కూడా నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.
సాయంత్రం మూడు గంటల సమయంలో ట్రాక్టర్ బోల్తా పడి సుమారు 35 మంది మహిళలకు గాయాలతో పాటు ఒక మహిళ చనిపోవడం జరిగినది. అందులో 8 మంది మహిళలకు కాళ్లు చేతులు విరగడంతో పాటు వారిలో ఒకరికి నడుము విరిగినదని ఆ కుటుంబాలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని పాణ్యం నియోజకవర్గం తొగర్చేడు గ్రామానికి చెందిన మహిళలు ఊరుమార్పురం గ్రామానికి వచ్చి పొగాకు దోరణాలు కుట్టి సాయంకాలం తిరిగి వారి ఇండ్లకు చేరుకోవడానికి ట్రాక్టర్ పైన తొగర్చేడు గ్రామానికి బయలుదేరారు. అయితే రెండు గ్రామాలకు మధ్యలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో సుమారు మూడు గంటల సమయమున ఘోర ప్రమాదం జరిగినదన్నారు. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మరణించడం జరిగినదని,మిగతా 32 మంది మహిళలకు తీవ్ర గాయాలతో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి నందు చేరారని అందులో చాలామంది పేద కుటుంబాల నుంచి పనిచేసుకొని బ్రతికే వాళ్లే కాబట్టి వారి కుటుంబాలను ఆదుకోకపోతే సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బాధ్యతలను కలుపుకొని ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

# యాగంటిలో రెడ్ క్రాస్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి బీసీ దంపతులు.

**-మహానందిలో రెడ్ క్రాస్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఆర్డీఓ విశ్వనాథ్.**

ఆంధ్ర ప్రగతి మహానంది ఫిబ్రవరి 26:
మహానందిలో రెడ్ క్రాస్ రక్త దాన శిబిరాన్ని, ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని నంద్యాల అడిషనల్ ఎస్పీ మంద జావలి ప్రారంభించారు. భోగేశ్వరంలో రెడ్ క్రాస్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన స్థానిక ఎస్సై, ఆర్ఎంపీడబ్ల్యుఏ రాష్ట్ర అధ్యక్షుడు తెలకపల్లి రాధాకృష్ణయ్యఓంకారంలో రెడ్ క్రాస్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన నంద్యాల రెడ్ క్రాస్ సెక్రెటరీ డాక్టర్ మమతారెడ్డి, ఆర్ఎంపీడబ్ల్యూఈ జిల్లా అధ్యక్షుడు రొక్కం నాగేశ్వర్రెడ్డిడోన్ బుగ్గ క్షేత్రంలో రెడ్ క్రాస్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ రితేష్, రూరల్ ఎస్సై మమత,శ్రీశైలంలో కైలాస ద్వారము దగ్గర, నందిమండపం దగ్గర కొనసాగుతున్న రెడ్ క్రాస్ వైద్య శిబిరంలో పాల్గొన్న కర్నూలు రెడ్ క్రాస్ జిల్లా మెంబరు అరుణ, నంద్యాల జిల్లా సభ్యులు నాగశేషు
రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల మాట్లాడుతూ పాదయాత్ర కోసం ఏర్పాటుచేసిన ఆత్మకూరు కృష్ణాపురం వైద్య శిబిరము, పెచ్చరువు వైద్య శిబిరము నిన్నటితో ముగిశాయని, శ్రీశైలంలో నందిమండపం దగ్గర కైలాస ద్వారం దగ్గర, మహానంది, యాగంటి, ఓంకారము, భోగేశ్వరము, డోన్ బుగ్గ క్షేత్రాలలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు రాత్రి పగలు అందుబాటులో ఉంటాయని భక్తులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.
శివ భక్తులకు మహానంది క్షేత్రంలో రక్తదాన ఉద్యమాన్ని అలవాటు చేయాలని లక్ష్యంతో నంద్యాల బ్లడ్ సెంటరు, విజయ బ్లడ్ బ్యాంక్, శాంతిరం బ్లడ్ బ్యాంక్, ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుల సహకారంతో ఇండియన్ రెడ్ కా సోసైటీ ఆధ్వర్యంలో మహానంది క్షేత్రంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని,
అలాగే ఉదయానంద హాస్పటల్ వారి ఆధ్వర్యంలో 35 సంవత్సరాలు దాటిన మహిళలకు ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరము ఏర్పాటు చేయడం జరిగిందనీ రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, జిల్లా సభ్యుడు ఉస్మాన్ భాష జిల్లా చైర్మన్ తో పాటుగా జిల్లాల్లో వివిధ ప్రాంతాలలో ఏర్పాటుచేసిన శిబిరాలను సందర్శించారు.
భగవంతుని సేవలో భక్తులు భక్తుల సేవలో రెడ్ క్రాస్ అనే సేవా విధానముతో కొన్ని వేల మంది భక్తులకు రెడ్ క్రాస్ వైద్య శిబిరాల ద్వారా సేవలందిస్తున్నామని స్థానిక రెడ్ క్రాస్ సభ్యులు, గ్రామీణ వైద్యులు, నాయకులుఈ శిబిరాలలో విశేష సేవలు అందిస్తున్నారని తెలిపారు.




# ఆధ్యాత్మిక విద్యా బోధన ఉచితంగా రాదు...

**ప్రభుత్వ కాజి జాఫర్ సాదిక్.!**

ఆంధ్రప్రగతి నంద్యాల ఫిబ్రవరి 26:
ఇహ పర లోకాలలో సాఫల్యం పొందేందుకు ప్రతి ఒక్క ముస్లిం సోదర సోదరీ మణులు ఆధ్యాత్మిక విద్యా కలిగి ఉండాలని ఆళ్లగడ్డ ప్రభుత్వ ఖాజి మహమ్మద్ జాఫర్ సాదిక్ పేర్కొన్నారు. బుధవారం ఆళ్లగడ్డ పట్టణంలోని డాక్టర్ రామలింగ రెడ్డి ఫంక్షన్ హాల్ లో హదియా ఇంటర్ నేషనల్ ఇనిస్టిట్యూట్ వారి అధ్వర్యంలో జిల్లా స్థాయి ఇస్లామిక్ ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఖురాన్ సూక్తులు,ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిపై కీర్తనలు తదితర అంశాలపై జిల్లా స్థాయిలోని 12 మండలాలకు చెందిన ఇస్లామిక్ విద్యార్థిని విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆళ్లగడ్డ మండల ప్రభుత్వ ఖాజి మహమ్మద్ జాఫర్ సాదిక్, పుంగనూరు దారుల్ హుదా ప్రిన్సిపాల్ మౌలానా శర్ఫుద్దిన్,20వ వార్డు కౌన్సిలర్ హుసేన్ భాష,ఆపుస్మ ఆళ్లగడ్డ యూనిట్ అధ్యక్షుడు టి.అమిర్ భాష లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇస్లామిక్ ధార్మిక విద్యా ఉచితంగా రాదని పరలోకంలో ఉన్నత స్థానం పొందేలా బోధించే ఇస్లామిక్ ధార్మిక పండితులు(హాఫిజ్ , ఆలిం )లకు వేతనాలు సరిపడ చెల్లించి ఇస్లామిక్ విద్యను పొందాలని సూచించారు. అనంతరం పోటీలో ప్రతిభ చాటిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ట్రోఫీలు అందజేశారు. అలాగే ప్రముఖ సామాజిక కార్యకర్త జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బిరువాల భాష మాట్లాడుతూ ఇస్లామిక్ ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న హదియా ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ వారు నిర్వహిస్తున్న ఇస్లామిక్ ధార్మిక కార్యక్రమాల వల్ల ఎంతోమంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇస్లామియా విద్యతోపాటు ఇస్లామిక్ సాంప్రదాయాలు పద్ధతులు నేర్చుకొని సమాజానికి ఉన్నతమైన పౌరులను అందజేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా లోని పలువురు ఇస్లామిక్ ధార్మిక పండితులు మౌలానా ఇర్షాద్ అహ్మద్, హాఫీస్ సద్దాం హుస్సేన్, హాఫీస్ ఉస్మాన్ భాష, హాఫీస్ కందుకూరు సాదిక్ తదితర ఆలింలు, హాఫీజ్ లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# నంద్యాల ముస్లిం సమాజానికి అండగా ఉంటా..!



**ముస్లింలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తా.**
**- నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి"ఎన్ఎండి ఫిరోజ్**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 26:**
నంద్యాల పట్టణంలోని నబినగర్ నందు ముస్లిం యూత్ కమిటీ, నంద్యాల ఆధ్వర్యంలో నిర్వహించిన ముస్లిం యూత్ కాన్ఫరెన్స్ %-% రంజాన్ స్వాగత సమావేశం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్ఎండి ఫిరోజ్ కి ఇస్లామిక్ పండితులు, ముస్లిం యూత్ కమిటీ సభ్యులు, ముస్లిం యువత ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇస్లామిక్ పండితులు పవిత్ర రంజాన్ మాసం ప్రాముఖ్యతను వివరిస్తూ తర్బియాత్, సామాజిక అవగాహన, ఖురాన్ లోని ముఖ్య సందేశాలను ముస్లిం యువకులకు తెలియజేశారు. ఈ సమావేశంలో నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ, రంజాన్ మాసానికి ముందు ముస్లిం యువతకు తర్బియాత్ మరియు సామాజిక అవగాహనపై నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో అవసరమైనదని అన్నారు. యువతను ఆకర్షిస్తున్న ఆన్లైన్ బెట్టింగ్, అధిక వడ్డీ బారిన పడి ఆత్మహత్యలు చేసుకోవడం వంటి సమస్యలు చాలా పెద్ద ముప్పుగా మారాయని, ఆత్మహత్యకు ఎవరూ పాల్పడకూడదని సూచించారు. ఎటువంటి క్లిష్ట పరిస్థితుల్లోనైన ఎవరైనా తనను సంప్రదిస్తే తాను ప్రతి సమస్యకు పరిష్కారం చూపేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. నంద్యాల ముస్లిం వ్యాపారుల సంక్షేమాన్ని ప్రస్తావిస్తూ, చిన్నా మరియు మధ్య తరహా వ్యాపారులను ప్రోత్సహించేందుకు తెలుగుదేశం ప్రభుత్వం మైనార్టీ సబ్సిడీ పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా మసీదులు, ఖబరిస్తాన్ల అభివృద్ధికి నిధులు కేటాయించడం జరిగిందని, మసీదుల మౌజన్ ఇమాములకు రూ. 45 కోట్ల నిధులు మంజూరు చేసి గౌరవ వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు న్యాయ మరియు మైనార్టీల సంక్షేమ శాఖ మంత్రి



ఫరూక్ నాయకత్వంలో ముస్లిం మైనారిటీల అభివృద్ధికి మరిన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.
అనంతరం ఈ కార్యక్రమంలో ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దువా చేయడం జరిగింది. అనంతరం నంద్యాల జిల్లా ఇమాముల సంఘానికి చెందిన హాఫిజ్, మౌలానా, ముఫ్తిలను ఎన్ఎండి ఫిరోజ్ ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇస్లామిక్ పండితులు, నంద్యాల జిల్లా ఇమాముల సంఘం సభ్యులు, వేలాది సంఖ్యలో ముస్లిం యువత, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు

## శంభాజీ చరిత్ర సినిమాగా రావడం హర్షణీయం


### విజయవాడలో చిత్రాన్ని వీక్షించిన మంత్రి సత్యాకుమార్



అమరావతిఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి : హిందూ సామ్రాజ్య స్థాపనకు కృషి చేసిన శంభాజీ మహారాజ్ సినిమాను విజయవాడలో మంత్రి సత్యకుమార్ యాదవ్ వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడున్నరేళ్ళ తరువాత సినిమా చూశానని.. ఒక వీరుడి సినిమా చూశాననే ఆనందం ఉందన్నారు. ఒక వీరుడి ముగింపు అలా జరిగినందుకు వేదన ఉంది.. ఛత్రపతి శివాజీ, శంభాజీ మహారాజ్‌లను మొదటి స్వాతంత్ర్య యోధులుగా చెప్పాలని పేర్కొన్నారు. అలాంటి వారి చరిత్ర సినిమాగా తీసినందుకు దర్శక నిర్మాతలను అభినందిస్తున్నానని తెలిపారు. సమకాలీన చరిత్రకారుల పైన సినిమా తీయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ అభిప్రాయపడ్డారు. వ్యాపారం కోసం స్మగ్లర్లను హీరోలుగా చూపించే విధానం సరికాదని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. హీరోలు గంజా డ్రగ్స్ తీసుకునే సినిమాలు, వ్యాపారం కోసం హీరోలను స్మగ్లర్లుగా చూపించే సినిమాలు యువతను తప్పు దారిలోకి నడిపిస్తాయని మంత్రి అన్నారు. వీరసావర్కర్ వర్ధంతి సందర్భంగా మరొక వీరుని సినిమా చూశానని.. సూరత్ నుంచి తంజావూరు వరకూ శంభాజీ హిందూ సామ్రాజ్యం నెలకొల్పాడని పేర్కొన్నారు. మన దేశానికి వలస పాలకులను గొప్ప హీరోలుగా చరిత్రకారులు సృష్టించారన్నారు. దేశంలో 60 ఏళ్ళకు పైగా పరిపాలన చేసిన పార్టీ మొఘలులు, తలిదండ్రులను చంపిన వారిని చరిత్తకారులుగా చూపించిందన్నారు. శంభాజీ, శివాజీ లాంటి వారి చరిత్ర అందరూ చదువుకోవాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

## ఐదు రోజులుగా కొనసాగుతున్న రెస్క్యూ పనులు


### బాధితులను బయటకు తీసుకొచ్చేందుకు శ్రమిస్తున్న 11 సంస్థలు



మహబూబ్‌నగర్,ఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి :టన్నెల్‌లో చిక్కుకున్న 8మందిని కాపాడేందుకు ఎన్నో ప్రయత్నాలు సాగుతున్నాయి. షిఫ్టుకి వందమందికి పైగా పనిచేస్తున్నారు. నాలుగు రోజులుగా నిరంతరాయంగా పనులు కొనసాగుతున్నాయి. అందర్నీ సజీవంగా తీసుకొచ్చేందుకు 11 సంస్థలు శ్రమిస్తున్నాయి. గంటలు గడుస్తున్న కొద్దీ టెన్షన్ పెరిగిపోతున్న నేపథ్యంలో.. వీలైనంత త్వరగా లోపలికి చేరుకునేందుకు యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా రెస్క్యూ సిబ్బందికి టీబీఎం చాలెంజింగ్‌గా మారింది. ప్రమాదం జరిగిన దగ్గర టీబీఎం ముక్కలై దాని విడిభాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో అక్కడ రెస్క్యూ చేయాలంటే చాలా ఇబ్బందులు ఉన్నాయి. ఓవైపు బురద, ఇంకోవైపు సీపేజ్ వాటర్, మరోవైపు టీబీఎం ముక్కలతో అత్యంత ప్రతికూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. గ్యాస్ కట్టర్లను ఉపయోగించి తీసేసే ప్రక్రియను జరపాలన్నా.. ఉబికి వస్తున్న నీరు ప్రతిబంధకంగా మారింది. ఇక రెస్క్యూ ఆపరేషన్లో ఇండియన్ ఆర్మీ, ఇండియన్ నేవీ పాలుపంచుకుంటున్నాయి. జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ర్యాట్ హోల్ మైనర్స్, సింగరేణి, హైడ్రా టన్నెల్ ఎక్స్‌పర్ట్స్ మరికొన్ని కంపెనీలు తమ సేవలను అందిస్తున్నాయి. మొత్తం 11 ఏజెన్సీలు నిరంతరం కోఆర్డినేషన్ చేసుకుంటూ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు.

## విపక్ష హోదా ఇవ్వాలంటేనే వణుకు

**ఎక్కడ నిలదీస్తామో అన్న భయం**
**అందుకే కారణాలు వెతుకుతున్నారు**
**వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి విమర్శలు**



అమరావతిఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి :ప్రజాస్వామ్య స్ఫూర్తికి తూట్లు పొడుతూ అసెంబ్లీలో అసలు ప్రధాన ప్రతిపక్ష గుర్తింపునే ఇవ్వకుండా, ప్రశ్నించే గొంతు వినిపించకుండా కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మండిపడ్డారు. ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాన ప్రతిపక్ష గుర్తింపు అంటే ఏదో రాజకీయపరమైన హోదాగా కూటమి పార్టీలు విషప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన ప్రతిపక్ష గుర్తింపు అనేది ఒక బాధ్యత, దీనివల్ల అసెంబ్లీలో ఎక్కువ సమయం ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు ఉండే అవకాశం వైఎస్సార్‌సీపీకి దక్కుతుందన్నారు. దీనిని కూడా వక్రీకరించడం దుర్మార్గమన్నారు. ఏపీ అసెంబ్లీలో నాలుగు పార్టీలు ఉంటే, దానిలో మూడు పార్టీలు ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నాయి. మిగిలిన వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాల్సి ఉంది. పార్లమెంట్ చట్టం 1977 ప్రకారం సభలో సభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రధాన ప్రతిపక్షంను గుర్తించాలి. కూటమి ప్రభుత్వం దీనిని ఏ మాత్రం ఖాతరు చేయడం లేదు. ప్రధాన ప్రతిపక్ష గుర్తింపును వైఎస్సార్‌సీపీ కోరుతుంటే దీనిని రాజకీయం చేయడం దుర్మార్గం. దీనిపై కూటమి పార్టీలు చేస్తున్న ఈ విమర్శలను చూసి ప్రజాస్వామికవాదులే ఆశ్చర్యపోతున్నారని అన్నారు.
÷రిమ్మిది నెలల కూటమి పాలనపై ఇప్పటికే ప్రజల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత ప్రారంభమైంది. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఎక్కడా నెరవేర్చడం లేదు. మరోవైపు గ్రూప్-2 నిరుద్యోగులు, మిర్చి రైతులు, విద్యుత్ చార్జీల భారాన్ని మోయలేని ప్రజలు బాహాటంగానే ప్రభుత్వం మీద తమ నిరసనను తెలియచేస్తున్నారు. వీటన్నింటినీ ప్రజల పక్షాన ఎక్కడ వైఎస్సార్‌సీపీ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఎండగడుతుందోననే భయంతోనే కూటమి ప్రభుత్వం ఉంది. న్యాయంగా వైఎస్సార్‌సీపీకి దక్కాల్సిన ప్రధాన ప్రతిపక్ష గుర్తింపును దూరం చేస్తూ, ప్రజా సమస్యలపై ఎక్కడ వైఎస్సార్‌సీపీ తమను ప్రశ్నిస్తుందోనని కంగారుపడుతోంది. ప్రతిపక్షంగా అడిగే ప్రశ్నలకు అసెంబ్లీలో సమాధానం చెప్పుకోలేని నిస్సహాయ స్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది. తమ పాలనా వైఫల్యాలను ప్రజాగొంతుకగా వైఎస్సార్‌సీపీ సభలో వినిపిస్తే తట్టుకోలేమనే ఉద్దేశంతోనే ప్రధాన ప్రతిపక్ష గుర్తింపును నిరాకరిస్తున్నారన్నారు.
శాసనమండలిలో ఇప్పటికే ప్రధాన ప్రతిపక్షంగా వైఎస్సార్‌సీపీ అనేక ప్రజా సమస్యలపై మాట్లాడుతోంది. ప్రధాన ప్రతిపక్ష గుర్తింపు ఉండటం వల్ల వైఎస్సార్‌సీపీ సభ్యులకు ఎక్కువ సమయం లభిస్తోంది. తాజాగా వైస్ చాన్సలర్ల బలవంతపు రాజీనామాలపై ప్రభుత్వాన్ని నిలదీయడంతో సమాధానం చెప్పలేక కూటమి ప్రభుత్వం కంగారు పడింది. గవర్నర్ ప్రసంగంలో మాట్లాడించిన మాటలు, చెప్పించిన అబద్దాలపై
నిలదీయడంతో అధికారపక్షం నీళ్ళు నమిలింది. తమ తప్పులను ఒప్పుకోవాల్సిన పరిస్థితిలో పడింది.
ప్రజాస్వామ్యంలో అధికారపక్షానికి ఎంత బాధ్యత ఉంటుందో, ప్రధాన ప్రతిపక్షంకు అంతకంటే ఎక్కువ బాధ్యత ఉంటుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తెలుగుదేశానికి ప్రతిపక్షంగా చట్టసభల్లో మాట్లాడేందుకు ఎంతో సమయం లభించింది. సభలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా చర్చలు జరిగితే వాటిని అర్థమవంతమైనవని అంటారా? ప్రధాన ప్రతిపక్షంగా ప్రశ్నించే వాటికి ధీటుగా సమాధానం చెప్పగలిగితేనే కూటమి ప్రభుత్వ పాలనా సామర్థ్యం ప్రజలకు తెలుస్తుందన్నారు.. ఇటువంటి సంప్రదాయాలకు తిలోదకాలు ఇస్తూ, అసలు ప్రధాన ప్రతిపక్ష గుర్తింపే లేకుండా, ప్రశ్నించేవారే లేకుండా ఏకపక్షంగా పాలనను సాగించాలని అనుకోవడం నిరంకుశత్వం అవుతుంది. సంఖ్యాబలం రీత్యా మాకే ప్రధాన ప్రతిపక్ష గుర్తింపు వస్తుందంటే, జనసేన పార్టీ కూటమి ప్రభుత్వం నుంచి బయటకు వచ్చి ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించాలన్నారు.

## నేడు తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలు

హైదరాబాద్,ఫిబ్రవరి 26 ఆంధ్రప్రగతి :
తెలంగాణలో 27న జరగనున్న గ్రాడ్యుయేట్, టీచర్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఈ ఎన్నికలు జరుగతనున్నాయి. 7 ఉమ్మడి జిల్లాల్లో ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది ఎన్నికల సంఘం. ఈ క్రమంలో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు ఇలా త్రిపాఠి. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా పాత 3 జిల్లాలు, కొత్తగా ఏర్పడ్డ 12 జిల్లాల అధికారుల కోఆర్డినేషన్ బాగుందని.. ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేస్తామని అన్నారు. సుమారు రెండు వేల మంది సిబ్బందితో ఎన్నికలు నిర్వహణ జరుగుతుందని అన్నారు త్రిపాఠి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 25,797 మంది ఓటర్లు ఉండగా.. 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ క్యామ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తామని అన్నారు. దాదాపు 1100 మందిని ఎన్నికల నిర్వహణ కోసం కేవలం పోలింగ్ కేంద్రాల్లోనే ఏర్పాటు చేశామని అన్నారు. విద్యావంతులైన ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు త్రిపాఠి. ఇలా త్రిపాఠితో పాటు పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడూతూ.. దాదాపు వేయి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో వెళ్లేటప్పటి నుంచి తిరిగి రిసెప్షన్ సెంటర్‌కు వచ్చే వరకు పోలీసుల భద్రత ఉంటుందని అన్నారు. వాహనం వెంట సెక్యూరిటీ కూడా నల్లగొండ జిల్లా పోలీసులే ఉంటారని.. బయటి జిల్లాల నుంచి బ్యాలెట్ పేపర్లను తరలించేటప్పుడు జిపిఎస్ సిస్టం పరిశీలిస్తూ సెక్యూరిటీ ద్వారా తీసుకొస్తామని తెలిపారు.

## హిందీని 'రుద్దకపోతే' మేము వ్యతిరేకించం



చెన్నై : తమిళనాడుపై హిందీని 'రుద్దకపోతే' డిఎంకె హిందీని వ్యతిరేకించబోదని, తమిళులపై ఆ భాషను రుద్దడం వారి ఆత్మ గౌరవంతో ఆటలు ఆడుకోవడమే అవుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి, డిఎంకె అధినేత ఎంకె స్టాలిన్ బుధవారం స్పష్టం చేశారు. హిందీ భాషను విధించే అంశంపై పార్టీ సభ్యులకు స్టాలిన్ ఒక లేఖ రాస్తూ, ఆత్మ గౌరవం తమిళులకు 'విశిష్ట' స్వభావం అని పేర్కొన్నారు. 'డిఎంకె ఇప్పటికీ హిందీని ఎందుకు వ్యతిరేకిస్తున్నదని అడుగుతున్నవారికి నా వినమ్ర సమాధానం ఏమిటంటే మీరు ఇప్పటికీ మాపై ఆ భాషను రుద్దుతుండడమే కారణన్నది' అని ఆయన తెలిపారు. 'మీరు హిందీని విధించకపోతే మేము వ్యతిరేకించం. తమిళనాడులో హిందీ పదాలపై నలుపు రంగు పూయం. ఆత్మగౌరం తమిళుల విశిష్ట లక్షణం, దానితో ఆటలు ఆడుకోవడానికి మేము ఎవ్వరినీ అనుమతించబోం' అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో తీవ్ర భాషా వివాదం నేపథ్యంలో స్టాలిన్ ఆ వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి)లోని త్రిభాషా సూత్రం ద్వారా హిందీని విధించే యత్నం చేస్తున్నదని డిఎంకె ఆరోపించగా, కేంద్ర ప్రభుత్వం ఆ ఆరోపణను ఖండించింది. ఆ అంశం డిఎంకె, రాష్ట్ర బిజెపి శాఖ మధ్య మాటల పోరుకు దారి తీసిన విషయం విదితమే. బిజెపి తమిళనాడు శాఖ అధ్యక్షుడు కె అన్నామలై ఆ అంశంపై డిఎంకెపై విరుచుకుపడుతున్నారు.

# టాప్5లోకి కోహ్లీ



## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ విడుదల

ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తిరిగి టాప్-5కి చేరుకున్నాడు. ఒక స్థానం మెరుగుపరుచుకుని ఐదో స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. ఇక బాబర్ అజామ్, శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్ వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు. యంగ్? క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ 9వ ర్యాంకులోనే కొనసాగుతుండగా, కేఎల్ రాహుల్ రెండు స్థానాలు మెరుగై 15వ ర్యాంక్?కు చేరుకున్నారు. మరోవైపు, బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో శ్రీలంక స్టార్? స్పిన్నర్ మహీశ్ తీక్షణ టాప్? పొజిషన్?లో ఉన్నాడు. ఆ తర్వాతి స్థానాల్లో రషీద్ ఖాన్, కుల్‌దీప్ యాదవ్ ఉన్నారు. అయితే గాయం నుంచి కోలుకుని ప్రస్తుత జట్టులో రాణిస్తున్న టీమ్‌ఇండియా స్టార్ మహ్మద్ సిరాజ్ మాత్రం రెండు స్థానాలకు దిగజారి 12వ ర్యాంకుకు పడిపోగా, షమి ఒక స్థానం మెరుగై 14వ ర్యాంకులో నిలిచాడు. ఇదిలా ఉండగా, ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో టాప్-10లో ఈ సారి ఎటువంటి మార్పులు లేవు. అఫ్గానిస్థాన్ స్టార్ క్రికెటర్? మహ్మద్ నబీ టాప్? పొజిషన్?లో ఉండగా, రవీంద్ర జడేజా 9వ ర్యాంకులో కొనసాగుతున్నారు. న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ మైకేల్ బ్రాస్‌వెల్ ఏకంగా 26 స్థానాలు ఎగబాకి 11వ ర్యాంక్?కు చేరుకున్నాడు. టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సూపర్ సెంచరీతో అదరగొట్టాడు. కొంతకాలంగా తనపై వస్తున్న విమర్శలకు విరాట్ అద్భుత శతకంతో సమాధానమిచ్చాడు. 100 (116 బంతుల్లో) అదరగొట్టాడు. విరాట్?కు వన్డేల్ల ఇది 52వ సెంచరీ కాగా, ఓవరాల్?గా 82వ అంతర్జాతీయ శతకం. ఈ లిస్ట్?లో విరాట్ కంటే ముందు సచిన్ తెందూల్కర్ (100 సెంచరీలు) ఒక్కడే ముందున్నాడు. ఈ మ్యాచ్?లోనే విరాట్ మరో ఘనత సాధించాడు. ఇప్పుడా స్కోరే తన ర్యాంకింగ్స్? మెరుగుపడేందుకు దోహదపడిందని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు. కాగా, ఈ మ్యాచ్?లో టీమ్‌ఇండియా 6 వికెట్ల తేడాతో నెగ్గింది. ఈ విజయంలో విరాట్ సెంచరీతో కీలక పాత్ర పోషించింది. వన్? డౌన్?లో క్రీజులోకి వచ్చిన విరాట్ మ్యాచ్ పూర్తి చేశాడు. ఈ క్రమంలోనే కెరీర్?లో 52వ సెంచరీ నమోదు చేశాడు. ఓవరాల్?గా విరాట్?కు ఇది 82వ అంతర్జాతీయ శతకం.

# గుజరాత్ పై ఢిల్లీ అలవోక విజయం

## టేబుల్ టాపర్ గా నిలిచిన ఢిల్లీ



డబ్ల్యూపీఎల్ లో ఢిల్లీ క్యాపిటల్స్ జోరు కొనసాగుతోంది. రెండుసార్లు రన్నరప్ ఢిల్లీ.. తాజాగా టేబుల్ టాపర్ గా నిలిచింది. మంగళవారం బెంగళూరులో జరిగిన మ్యాచ్ లో గుజరాత్ జెయింట్స్ పై ఆరు వికెట్లతో సునాయాస విజయం సాధించింది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 127 పరుగులు చేసింది. జట్టులో భారతి ఫుల్ మాలి (29 బంతుల్లో 40 నాటౌట్, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) ధనధాన్ ఇన్నింగ్స్ తో టాప్ స్కోరర్ గా నిలిచింది. బౌలర్లలో శిఖా పాండే, మారిజానే కాప్, అన్నాబెల్ సదర్లాండ్ లకు తలో రెండు వికెట్లు దక్కాయి. ఛేదనను 15.1ఓవర్లలో నాలుగు వికెట్లకు 131 పరుగులు చేసి విజయం సాధించింది. జెస్ జొనసెన్ ఆల్ రౌండ్ షో (32 బంతుల్లో 61 నాటౌట్, 9 ఫోర్లు, 2 సిక్సర్లు, 1-24)తో అదరగొట్టింది. దీంతో మరో 29 బంతులు ఉండగానే అలవోక విజయాన్ని ఢిల్లీ సొంతం చేసుకుంది. దీంతో మూడు విజయాలతో టేబుల్ టాపర్ గా నిలిచింది. జొనసెన్ కే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. బుధవారం జరగబోయే మ్యాచ్ లో యూపీతో ముంబై తలపడనుంది. ముందుగా బ్యాటింగ్ ప్రారంభించిన గుజరాత్ .. తొందరగానే పీకల్లతో కష్టాల్లో కూరుకుపోయింది. హర్లీన్ డియోల్ (5), కెప్టెన్ యాష్లీ గార్డెనర్ (3), ఫక్షబ్ లిచ్ ఫీల్డ్ , కశ్వీ గౌతమ్ డకౌట్లుగా వెనుదరిగడంతో ఒక దశలో 60-6తో దయనీయమైన స్థితిఓలో నిలిచింది. మధ్యలో డియేంద్ర డాటిన్ (26) కాస్త పోరాడినా, ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయింది. ఈ దశలో భారతి, తనుజా కన్వర్ (16) జట్టును ఆదుకున్నారు. ఏడో వికెట్ కు 51 పరుగులు జోడించడంతో గుజరాత్ గౌరవ ప్రదమైన స్కోరును సాధించింది. అలాగే ఎక్స్ట్రాల రూపంలో మరో 21 పరుగులు కూడా రావడం గుజరాత్ కు ప్లస్ పాయింట్ గా మారింది. మిగతా బౌలర్లలో టిటాస్ సాధుకు ఒక వికెట్ దక్కింది. ఛేజింగ్ లో ఢిల్లీకి ఆరంభంలోనే ఎదురు దెబ్బ తగిలింది. కెప్టెన్ మెగ్ ల్యానింగ్ (3) విఫలమైంది. ఈ దశలో షెఫాలీ వర్మ (27 బంతుల్లో 44, 5 ఫోర్లు, 3 సిక్సర్లు) తో కలిసి జొనసెన్ జట్టును ముందుకు నడిపించింది. వీరిద్దరూ గుజరాత్ బౌలర్లను ఓ ఆటాడుకోవడంతో స్కోరు బోర్డు చెకచెకా కదిలింది. వేగంగా ఆడిన షెఫాలీ ఔటవడంతో రెండో వికెట్ కు నమోదైన 74 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. మధ్యలో మిడిలార్డర్ బ్యాటర్లు జెమీమా రోడ్రిగ్స్ (5), అన్నాబెల్ సదర్లాండ్ (1) త్వరగానే ఔటైనా మారిజాన్ (9 నాటౌట్) తో కలిసి జట్టును విజయ తీరాలకు చేర్చింది. ఈక్రమంలో కేవలం 26 బంతుల్లోనే జొనసెన్ ఫిఫ్టీ పూర్తి చేసింది. మిగతా బౌలర్లలో కశ్వీ గౌతంకి రెండు, గార్డెనర్, తనుజాకు ఒక వికెట్ దక్కింది.

# అందుకే టీమిండియాతో ఓడిపోయాం

## : పాక్ జట్టు కోచ్ జావెద్



అనుభవజ్ఞులైన ఆటగాళ్లు లేకపోవడం వల్ల భారత్ చేతిలో ఓటమి చెందామని పాకిస్థాన్ క్రికెట్ కోచ్ అకీబ్ జావెద్ అన్నారు. భారత జట్టు చేతిలో ఓటమితో అభిమానుల కంటే ఆటగాళ్లు ఎక్కువగా బాధపడ్డారని ఆయన అన్నారు. ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్ రెండు మ్యాచ్‌లలో పరాజయం పొంది టోర్నీ నుండి నిష్క్రమించింది. మొదట న్యూజిలాండ్, తర్వాత భారత్ చేతిలో ఓడిపోయింది. రేపు బంగ్లాదేశ్‌తో జరిగే మ్యాచ్‌లో గెలిచి పరువు నిలబెట్టుకోవాలని భావిస్తోంది. ఈ క్రమంలో పాక్ కోచ్ జావెద్ మీడియాతో మాట్లాడుతూ, ఒక్క దుబాయ్‌లోనే మ్యాచ్‌లు ఆడటం భారత జట్టుకు కలిసి వస్తుందని కొందరు చెబుతున్నారని, కానీ తమ ఓటమికి దానిని సాకుగా చూపబోమని ఆయన అన్నారు. ఒకే మైదానంలో ఆడటం, ఒకే హోటల్‌లో ఉండటం వల్ల కచ్చితంగా ప్రయోజనం ఉంటుందని, కానీ తమ జట్టు దాని వల్ల ఓడిపోలేదని పేర్కొన్నారు. తమతో మ్యాచ్‌కు ముందు భారత జట్టు దుబాయ్‌లో పది మ్యాచ్‌లు ఆడలేదని అన్నారు. తమ జట్టు మెరుగుపడాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తదుపరి మ్యాచ్‌పై తాము దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కానీ భారత్-పాకిస్థాన్ మ్యాచ్ జరిగితే చాలా భావోద్వేగాలు ముడిపడి ఉంటాయని అన్నారు. భారత్‌తో ఓటమి వల్ల అభిమానులు, జర్నలిస్టుల కంటే ఆటగాళ్లే ఎక్కువగా మానసిక వేదనకు గురవుతున్నారని ఆయన అన్నారు.
భారత జట్టుతో ఆడటానికి చాలా అనుభవం అవసరమని ఆయన అన్నారు. ప్రస్తుతం ఉన్న భారత జట్టు అత్యంత అనుభవజ్ఞులతో నిండి ఉందని, కానీ పాక్ జట్టులో అనుభవజ్ఞులైన వారు లేరని వెల్లడించారు. బాబర్ అజామ్ మాత్రమే 100 కంటే ఎక్కువ మ్యాచ్‌లు ఆడాడని, మహ్మద్, రిజ్వాన్‌లకు కొంత అనుభవం ఉందని, మిగతా ప్లేయర్లంతా 30 మ్యాచ్‌ల కంటే తక్కువగా ఆడారని తెలిపారు.

# భవిష్యత్తులో మంచి ప్రదర్శనలు ఇవ్వాలనేదే నా ఉద్దేశ్యం

## భారత పేస్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా



భారత పేస్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా తన అద్భుతమైన ప్రదర్శనకు గాను ఐసీసీ గౌరవాలను అందుకున్నాడు. 2024లో అన్ని ఫార్మాట్లలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన బుమ్రా, "సర్ గార్ఫీల్డ్ సోబర్స్ ట్రోఫీ"తో పాటు ఐసీసీ పురుషుల క్రికెటర్ ఆఫ్ ది ఇయర్, ఐసీసీ టెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులను అందుకున్నాడు. అంతేకాక, అతను ఐసీసీ టెస్ట్, టీ20%×% టీమ్ ఆఫ్ ది ఇయర్‌లో చోటు సంపాదించాడు. పాకిస్థాన్‌తో భారత్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌కు ముందు, బుమ్రా దుబాయ్‌లో తన అవార్డులను స్వీకరించాడు. ఈ సందర్భంగా తన చిన్ననాటి హీరోలు గెలుచుకున్న ఈ అవార్డు తనకూ దక్కడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చెప్పాడు. "చిన్నప్పుడు ఈ ట్రోఫీని చాలా మంది దిగ్గజ ఆటగాళ్లు గెలుచుకున్నారు. ఇప్పుడు నేనూ అదే గౌరవాన్ని పొందడం చాలా ప్రత్యేకమైన అనుభూతి" అని బుమ్రా వ్యాఖ్యానించాడు. 2024లో బుమ్రా అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచాడు. టెస్టుల్లో 71 వికెట్లు తీసి అగ్రస్థానంలో నిలిచాడు. వెస్టిండీస్, %ఖూూ%లో జరిగిన పురుషుల %ు%20 ప్రపంచకప్‌లో కూడా అతని ప్రభావం స్పష్టంగా కనిపించింది. తన అసాధారణ బౌలింగ్‌తో భారత్‌ను 11 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ గెలుచుకునేలా చేశాడు. టెస్టుల్లో 14.92 సగటుతో వికెట్లు తీసిన బుమ్రా, బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్ టూర్‌లలో తన దూకుడు చూపించాడు. %ు%20 ప్రపంచకప్‌లో 4.17 ఎకానమీతో 15 వికెట్లు తీసి భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. "మేము గెలిచిన %ు%20 ప్రపంచకప్ ఎప్పటికీ ప్రత్యేకమే. 2024లో మా టీమ్‌కు అనేక అనుభవాలు ఎదురయ్యాయి. టెస్టులు ఎక్కువగా ఆడాం, కొత్త పరిస్థితులను ఎదుర్కొన్నాం. ఈ ప్రయాణం నాకు చాలా నేర్పింది. భవిష్యత్తులో కూడా మంచి ప్రదర్శనలు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఉన్నాను" అని బుమ్రా చెప్పాడు. ఈ ఏడాది ప్రారంభంలో వెన్నునొప్పి కారణంగా బుమ్రా కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే, మహ్మద్ షమీ గాయంతో దూరంగా ఉన్న సమయంలో బుమ్రా భారత్ బౌలింగ్ యూనిట్‌ను ముందుండి నడిపించాడు. షమీ తిరిగి జట్టులోకి వచ్చిన తర్వాత, అతని కమ్‌బ్యాక్‌పై బుమ్రా సంతోషం వ్యక్తం చేశాడు. "అతను చాలా కాలం గాయంతో బాధపడ్డాడు. కానీ ఇప్పుడు తిరిగి వచ్చి మళ్లీ తన బౌలింగ్ నైపుణ్యాన్ని చూపిస్తున్నాడు. అతను జట్టుకు మరింత సహాయపడతాడని ఆశిస్తున్నాను" అని బుమ్రా అభిప్రాయపడ్డాడు. భారత బౌలింగ్ యూనిట్ అద్భుతంగా రాణిస్తోండగా, బుమ్రా ఛాంపియన్స్ ట్రోఫీలో తన జట్టుకు మరింత విజయాలు అందించాలని కోరుకుంటున్నాడు. అతని ప్రదర్శన భారత్ విజయంలో కీలకంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



**ఛాంపియన్స్ ట్రోఫీలో ఇంగ్లండ్ ఐ ఆఫ్ఘనిస్థాన్**

- **50 ఓవర్లలో 7 వికెట్లకు 325 పరుగులు చేసిన ఆఫ్ఘన్ టీమ్**
- **49.5 ఓవర్లలో 317 పరుగులకు ఇంగ్లండ్ ఆలౌట్**
- **జో రూట్ సెంచరీ వృథా**
- **5 వికెట్లతో రాణించిన అజ్మతుల్లా ఒమర్జాయ్**

# ఆఫ్ఘనిస్థాన్ సంచలన విజయం...


## ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి ఇంగ్లండ్ అవుట్

ఛాంపియన్స్ ట్రోఫీలో నేడు సిసలైన సంచలనం నమోదైంది. ఆఫ్ఘనిస్థాన్ జట్టు అద్భుత పోరాటంతో ఇంగ్లండ్ ను ఓడించింది. భారీ స్కోర్లు నమోదైన ఈ మ్యాచ్ లో ఆఫ్ఘన్ జట్టు 8 పరుగుల తేడాతో విజయం సాధించింది. తద్వారా ఇంగ్లండ్ జట్టును ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి ఇంటికి పంపింది. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘన్ టీమ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 325 పరుగులు చేసింది. ఓపెనర్ ఇబ్రహీం జాద్రాన్ రికార్డు సెంచరీ (177)తో అదరగొట్టాడు. అనంతరం 326 పరుగుల లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ దాదాపు గెలిచినంత పనిచేసింది. చివరి ఓవర్లో ఆ జట్టు గెలవాలంటే 13 పరుగులు అవసరం కాగా... కేవలం 4 పరుగులే చేసి ఓటమిపాలైంది. ఇంగ్లండ్ 49.5 ఓవర్లలో 317 పరుగులకు ఆలౌట్ అయింది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్ లో సీనియర్ ఆటగాడు జో రూట్ సెంచరీ సాధించాడు. రూట్ 111 బంతుల్లో 120 పరుగులు చేశాడు. బెన్ డకెట్ 38, కెప్టెన్ జోస్ బట్లర్ 38, జేమీ ఒవెర్టన్ 32, హ్యారీ బ్రూక్ 25 పరుగులు చేశారు. ఆఫ్ఘన్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్జాయ్ 5 వికెట్లు తీయడం విశేషం. మహ్మద్ నబీ 2, ఫజల్ హక్ ఫరూఖీ 1, రషీద్ ఖాన్ 1, గుల్బదిన్ నాయబ్ 1 వికెట్ తీశారు. ఈ విజయంతో ఆఫ్ఘనిస్థాన్ గ్రూప్-బి నుంచి సెమీస్ అవకాశాలు మెరుగుపర్చుకోగా... ఇంగ్లండ్ వరుసగా రెండు ఓటములతో టోర్నీ నుంచి నిష్క్రమించింది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ‘ఛావా’ను తెలుగులో రిలీజ్ చేస్తున్న గీతా ఆర్ట్స్...




బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్, రష్మిక జంటగా లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం ‘ఛావా’. మడాక్ ఫిల్మ్స్ పతాకంపై దినేశ్ విజన్ ఈ సినిమాను నిర్మించారు. మహారాష్ట్ర యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ పెద్ద కుమారుడు శంభాజీ మహరాజ్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ మూవీ తెరకెక్కిన విషయం తెలిసిందే. ఈ నెల 14న విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద కాసులవర్షం కురిపిస్తోంది. 12 రోజుల్లోనే ఏకంగా రూ. 500 కోట్ల వసూళ్లు రాబట్టింది.

ఇలా బాక్సాఫీస్ వద్ద దూసుకెళుతున్న ఛావాను ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ ఇప్పుడు తెలుగులో విడుదల చేస్తోంది. మార్చి 7న తెలుగులో రిలీజ్ చేస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. గొప్ప ప్రజాదరణ పొందిన శంభాజీ మహరాజ్ ఇతిహాస గాథ ఇప్పుడు తెలుగులో గర్జించడానికి సిద్ధంగా ఉందని పేర్కొంది. ప్రేక్షకుల డిమాండ్ మేరకు తెలుగులో విడుదల చేస్తున్నట్లు గీతా ఆర్ట్స్ తెలిపింది. ఈ మేరకు ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసిన నిర్మాణ సంస్థ విడుదల తేదీని ఖరారు చేసింది.



# కాంఛన : పూజా హెగ్డేతో పెద్ద రిస్క్

కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ నటుడిగా, దర్శకుడిగా కాంచన సిరీస్‌తో మంచి గుర్తింపు దక్కించుకున్నాడు. ఇప్పటి వరకు కాంచన సిరీస్‌లో మూడు పార్ట్‌లు ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చిన దర్శకుడు లారెన్స్ ప్రస్తుతం కాంచన ఫ్రాంచైజీలో నాలుగో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నాడు. ఈ సినిమాలో ఎప్పటిలాగే రాఘవ లారెన్స్ హీరోగా కనిపించనున్నాడు. ఇక హీరోయిన్‌గా పూజా హెగ్డేను ఎంపిక చేశారు. కాంచన 4లో పూజా హెగ్డే కన్ఫర్మ్ అయిన వార్తలు చాలా రోజుల నుంచి వస్తున్నాయి. కానీ తాజాగా సినిమాలో ఆమె పోషిస్తున్న పాత్ర గురించి ఆసక్తికర పుకారు ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పూజా హెగ్డే అనగానే గ్లామర్ పాత్రలు గుర్తుకు వస్తాయి. కెరీర్ ఆరంభంలో ఒకటి రెండు సినిమాల్లో మినహా అన్ని సినిమాల్లోనూ ఫుల్ గ్లామర్ రోల్స్ చేసింది. ముఖ్యంగా ఈమె డీజే, అల వైకుంఠపురంలో ఇంకా చాలా సినిమాల్లో పూజా హెగ్డే గ్లామర్ షోతో అలరించింది. అందుకే పూజా హెగ్డేను ఎక్కువగా స్కిన్ షో పాత్రల్లోనే చూడాలని ప్రేక్షకులు కోరుకుంటారు. ఆమెను కెరీర్ ఆరంభం నుంచి కథలో ప్రాముఖ్యత ఉన్న పాత్రల్లో చూడలేదు, ఒకవేళ అలాంటి పాత్రల్లో నటించినా ఆ సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచాయి. స్కిన్ షో పై ఆధార పడ్డ కారణంగానే పూజా హెగ్డే ఈ మధ్య కాలంలో సినిమా ఆఫర్లు దక్కించుకోలేక పోతుంది. నిజాయితీ టాలీవుడ్‌లో ఈ అమ్మడు సినిమాలకు కమిట్ అయి చాలా కాలం అయింది. ఆ మధ్య బాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేసింది. కానీ అక్కడ కూడా పెద్దగా ఆఫర్లు రావడం లేదు. ప్రస్తుతం లారెన్స్ దర్శకత్వంలో వస్తున్న ‘కాంచన 4’ సినిమాలో నటిస్తుంది. ఈ సినిమాలో చెవిటి – మూగ అమ్మాయి పాత్రలో పూజా హెగ్డేను రాఘవ లారెన్స్ చూపించబోతున్నాడని ప్రచారం జరుగుతోంది. తన గత చిత్రాల్లో హీరోయిన్‌ను గ్లామర్‌గానే చూపించిన లారెన్స్ కాంచన 3 లో నిత్యా మీనన్‌ను డీ గ్లామర్‌గా చూపించాడు. ఇప్పుడు కాంచన 4 లోనూ హీరోయిన్ పూజా హెగ్డేను డీ గ్లామర్‌గా చూపించబోతున్నట్లు తెలుస్తుంది. పూజా హెగ్డే వంటి గ్లామర్ హీరోయిన్‌ను డీ గ్లామర్ పాత్రలో చూపించడం అనేది కచ్చితంగా పెద్ద సాహసం అని చెప్పాలి. అది కాకుండా చెవిటి మూగ అమ్మాయిగా పూజా హెగ్డేను చూపించాలి అనుకోవడం ద్వారా లారెన్స్ చాలా పెద్ద రిస్క్ తీసుకుంటున్నాడు అనే అభిప్రాయంను సినీ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పాత్రలకు ప్రత్యేకంగా కొందరు హీరోయిన్స్ ఉన్నారని, వారిని కాకుండా ఇలా పూజా హెగ్డేను తీసుకోవడం వల్ల సినిమాను రిస్క్‌లో పెట్టినట్లు అవుతుంది అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. లారెన్స్ పెట్టుకున్న నమ్మకంను పూజా హెగ్డే ఎంత వరకు నెరవేరుస్తుందో చూడాలి.



# డెకాయిట్ షూటింగ్ అప్డేట్ ఇచ్చిన మృణాల్

సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిరస్థానాన్ని సంపాదించుకున్న మృణాల్ ఠాకూర్ మొదటి సినిమాతోనే మంచి సక్సెస్ అందుకుంది. అయితే మృణాల్ చివరగా విజయ్ దేవరకొండతో కలిసి ఫ్యామిలీ స్టార్ సినిమాతో ఆడియన్స్ ను పలకరించింది. ప్రస్తుతం మృణాల్ అడివి శేష్ తో కలిసి డెకాయిట్ సినిమాలో నటిస్తోంది. ఈ సినిమాలో మృణాల్ ఫస్ట్ లుక్ ను చూసి అందరూ ఆశ్చర్యపోయారు. మృణాల్ ఫస్ట్ లుక్ తర్వాత డెకాయిట్ నుంచి ఎలాంటి అప్డేట్ వచ్చింది లేదు. దీంతో ఈ సినిమా అప్డేట్స్ తెలుసుకోవాలని ఆడియన్స్ ఎంతో ఆసక్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే మృణాల్ డెకాయిట్ గురించి అప్డేట్ ఇచ్చింది. పేపర్ వెయిట్‌ను చేత్తో గుండ్రంగా తిప్పుతూ తాను డెకాయిట్ షూట్ లో ఉన్న విషయాన్ని వెల్లడించింది మృణాల్. ఇప్పటివరకు రొమాంటిక్, ఫ్యామిలీ డ్రామా సినిమాల్లో నటించిన మృణాల్ కు ఈ సినిమా పూర్తి భిన్నంగా ఉండనుంది. మృణాల్ నటిస్తున్న మొదటి థ్రిల్లర్ సినిమా డెకాయిట్. ఫస్ట్ లుక్ లో మృణాల్ ను చూసి షాకైన అభిమానులు ఈ యాక్షన్ థ్రిల్లర్ లో అమ్మడిని ఎప్పుడెప్పుడు చూస్తామా అని ఎదురుచూస్తున్నారు. పోస్టర్ లో మృణాల్ లుక్ చాలా భీకరంగా కనిపించడంతో డెకాయిట్ పై ఉన్న అంచనాలు మరింత పెరిగాయి. ఇదిలా ఉంటే డెకాయిట్ మూవీతో షానీల్ డియో దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నాడు. సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతుంది. తనకు ద్రోహం చేసిన తన ఎక్స్ లవర్ పై ప్రతీకారం తీర్చుకునే కోపంతో ఉన్న దోషి కథగా డెకాయిట్ ఉండబోతుంది. ఈ సినిమాపై అడివి శేష్, మృణాల్ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వాస్తవానికి ఈ సినిమా ముందుగా శృతి హాసన్ దగ్గరకు వెళ్లింది. టీజర్ కూడా రిలీజ్ చేసిన తర్వాత కొన్ని కారణాల వల్ల శృతి తప్పుకోవడంతో ఆ

# పెళ్లిలోనే పెళ్లి కొడుకుని లేపేసే గొడవ... ‘ఆహా’లో ‘మద్రాస్ కారన్’



‘ఆహా’లో ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు రావడానికి మరో సినిమా రెడీ అవుతోంది. తమిళంలో నిర్మితమైన ఆ సినిమా పేరే ‘మద్రాస్ కారన్’. షేన్ నిగమ్, నిహారిక, కలైయరసన్ ప్రధానమైన పాత్రలను పోషించారు. జనవరి 10వ తేదీన థియేటర్లకు ఈ సినిమా వచ్చింది. సామ్ సీఎస్ సంగీతాన్ని అందించిన ఈ సినిమా, సంక్రాంతి పోటీని తట్టుకుని యావరేజ్ టాక్ తెచ్చుకుంది.

అలాంటి ఈ సినిమా రేపటి నుంచి ‘ఆహా’లో స్ట్రీమింగ్ కానుంది. అందుకు సంబంధించిన ప్రకటన చేస్తూ, అధికారిక పోస్టర్ ను వదిలారు. రివెంజ్ డ్రామా నేపథ్యంలోనే నడిచే కథ ఇది. వాలి మోహన్ దాస్ ఈ సినిమాకి దర్శకత్వం వహించాడు. ఈ సినిమాకి సెకండాఫ్ మైనస్ అయిందనే టాక్ వినిపించింది. అలాంటి ఈ సినిమా ఇప్పుడు ‘ఆహా’కి వస్తోంది. కథ విషయానికి వస్తే, మీరా – సత్య ప్రేమించుకుంటారు. వాళ్ల పెళ్ళికి ఏర్పాట్లు జరుగుతాయి. మగపెళ్లివారు తరలివస్తారు. ఆ ఊళ్లోని దురై సింగంతో పెళ్లి కొడుకు గొడవ పడతాడు. దాంతో ఊళ్లో వాళ్లంతా ఏకమైపోయి, పెళ్లి కొడుకుతో పాటు అతని కుటుంబ సభ్యులను చంపాలని నిర్ణయించుకుంటారు. ఆ తరువాత ఏం జరుగుతుంది? అనేది మిగతా కథ.

# కొడుకుని పరిచయం చేసిన ప్రభుదేవా



ఇండియన్ మైఖేల్ జాక్సన్ గా పేరొందిన ప్రభుదేవా రీసెంట్ గా చెన్నైలో ఓ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ నిర్వహించాడు. ప్రభుదేవా లైవ్ డ్యాన్స్ వైబ్ పేరుతో ఓ కాన్సర్ట్ ను నిర్వహించాడు. ఈ ఈవెంట్ కు ఎంతో మంది సినీ సెలబ్రిటీలు హాజరయ్యారు. అయితే ఈ కాన్సర్ట్ లో ప్రభుదేవా తన కొడుకు రిషి రాఘ్వేందర్‌ను ప్రభుదేవా ఆడియన్స్ కు పరిచయం చేశాడు. తన కొడుకు ఫస్ట్ స్టేజ్ పెర్ఫార్మెన్స్ వీడియోను ఎక్స్‌లో షేర్ చేస్తూ ఎమోషనల్ పోస్ట్ చేశాడు ప్రభుదేవా. నా కొడుకు రిషి రాఘ్వేందర్ దేవాను పరిచయం చేయడం ఎంతో గర్వంగా ఉందని, మేమిద్దరం కలిసి స్టేజ్ షేర్ చేసుకోవడం ఇదే మొదటిసారి అని, ఇది కేవలం ఓ డ్యాన్స్ పెర్ఫార్మెన్స్ మాత్రమే కాదని, అంతకంటే ఎక్కువని, ఇది తన వారసత్వమని, ఇప్పుడే మొదలవుతున్న జర్నీ అని ప్రభుదేవా వీడియోను పోస్ట్ చేస్తూ రాసుకొచ్చాడు. ఇదిలా ఉంటే ప్రభుదేవాకు ఇద్దరు పిల్లలుండగా అందులో ఒకరు రిషి రాఘ్వేందర్, మరొకరు అదిత్. ఈ వీడియోను చూసిన ఆయన ఫ్యాన్స్ తెగ ఖుషీ అవుతున్నారు. రిషి రాఘ్వేందర్ దేవా తో ప్రభుదేవా కాలు కదపడం ఇప్పుడు అందరి దృష్టిని ఎట్రాక్ట్ చేస్తోంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియోను చూసిన వారంతా రిషి అచ్చం ప్రభుదేవా లానే ఉన్నాడని, ఆయనలానే డ్యాన్స్ చేస్తున్నాడని కామెంట్స్ చేస్తున్నారు. ఇక ప్రభుదేవా విషయానికొస్తే ఆయన యాక్టర్ గా, కొరియోగ్రఫర్ గా, డైరెక్టర్ గా పలు రంగాల్లో రాణిస్తున్నాడు. ఎన్నో సూపర్ హిట్ సాంగ్స్ కు కొరియోగ్రఫీ చేసిన ప్రభుదేవా, తెలుగులో నువ్వొస్తానంటే నేనొద్దంటానా సినిమాకు దర్శకత్వం వహించి బ్లాక్ బస్టర్ అందుకున్నాడు. ఆయన మొన్న చెన్నైలో చేసిన కాన్సర్ట్ కు అలనాటి హీరోయిన్లు కూడా హాజరై ప్రభుదేవాతో కాలు కదిపిన విషయం తెలిసిందే.

# డార్లింగ్ కోసం ప్రశాంత్ వర్మ



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం పలు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు. మారుతి దర్శకత్వంలో ది రాజా సాబ్ చేస్తున్న ప్రభాస్, హను రాఘవపూడి దర్శకత్వంలో ఫౌజీ కూడా చేస్తున్నాడు. ఉగాదికి సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో చేయనున్న స్పిరిట్ సినిమాను పట్టాలెక్కించబోతున్నాడు. ఇవి కాకుండా మరికొన్ని సినిమాలు కూడా ప్రభాస్ లైన్ లో ఉన్నాయి. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో సలార్2తో పాటూ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో కల్కి2ను కూడా పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభాస్ పై ఉంది. ఇవి కాకుండా మరికొన్ని సినిమాలకు కూడా ప్రభాస్ గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కు ప్రభాస్ ఛాన్స్ ఇచ్చాడని వార్తలు వినిపిస్తున్నాయి. సలార్ నిర్మాణ సంస్థ హొంబళే ఫిల్మ్స్, ప్రభాస్ తో లాక్ చేసుకున్న మూడు సినిమాల్లో ప్రశాంత్ వర్మ సినిమా కూడా ఒకటని, త్వరలోనే డార్లింగ్ ను ఈ టాలెంటెడ్ డైరెక్టర్ డైరెక్ట్ చేయనున్నాడని టాక్ నడుస్తోంది. అయితే ఇప్పుడు ప్రశాంత్ వర్మ– ప్రభాస్ సినిమాకు సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ బజ్ వినిపిస్తోంది. ప్రభాస్ ప్రస్తుతం ప్రశాంత్ వర్మ మూవీ లుక్ టెస్ట్ లో ఉన్నట్టు వార్తలు చాలా గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ వీక్ లోనే లుక్ టెస్ట్ పూర్తవుతుందని, ఇప్పటికే ప్రశాంత్ వర్మ ప్రభాస్ కోసం ఓ ఇంట్రెస్టింగ్ లుక్ ను కూడా డిజైన్ చేశాడని తెలుస్తోంది. త్వరలోనే వీరిద్దరి కాంబినేషన్ లో సినిమాపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ కూడా రానుందని అంటున్నారు. ఇక ప్రశాంత్ వర్మ విషయానికొస్తే, హనుమాన్ సినిమా తర్వాత ప్రశాంత్ వర్మ అసలు ఏ సినిమా చేస్తాడో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. హనుమాన్ తర్వాత రణ్‌వీర్ సింగ్ తో ప్రాజెక్టు అన్నారు, కానీ అది క్యాన్సిల్ అయింది. దీంతో జై హనుమాన్ చేస్తాడన్నారు. కానీ రిషబ్ శెట్టి కాంతార2 తో బిజీగా ఉండటంతో గ్యాప్ వచ్చింది. మధ్యలో నందమూరి మోక్షజ్ఞ డెబ్యూ కూడా ప్రశాంత్ వర్మ చేతికే వచ్చింది. డిసెంబరులో మొదలవాల్సిన ఈ సినిమా ఇంకా పట్టాలెక్కకపోగా దాని గురించి తర్వాత ఎలాంటి అప్డేట్ కూడా లేదు. ఇప్పుడు మళ్లీ ప్రభాస్ సినిమా అంటున్నారు. మరి వీటన్నింటిలో ప్రశాంత్ వర్మ ఏ సినిమాను ముందు పట్టాలెక్కిస్తాడో చూడాలి.